



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 108 | ది. 29-7-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 108 | Date : 29-7-2026 | Wednesday | Pages : 8 | Rs.1/-


# స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా రాజధాని పనులు

● వేగం మరింత పెరగాలి...అనుకున్న సమయానికి పనులు పూర్తి కావాలి

● రాజధాని పనులపై కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి,జూలై 28 (వార్తాప్రభ) :** రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం మరింత పెరగాలని....అనుకున్న సమయానికి ప్రతి ప్రాజెక్టు పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా రాజధాని పనులు జరగాలని సీఎం అన్నారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత మేర పెరిగినా... ఇంకా వేగం పెంచాలన్నారు. ఒక నిర్మాణ సంస్థగా రాజధాని పనులు చేపట్టడం గొప్ప అవకాశమని...ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. ఆర్థికంగా ఎటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చూస్తున్న నేపథ్యంలో... పనుల్లో ఎక్కడా జాప్యం ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో రాజధాని అమరావతి నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజధానిలో 95 ప్రాజెక్టులకు సంబంధించి రూ.50,999 కోట్ల విలువైన పనులు చేపట్టగా...నెలకు కనీసం 7.92 శాతం పనులు జరగాలని సూచించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్లు వంటి అంశాల్లో అన్ని శాఖలు, ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అమరావతి అంటే... కేవలం 29 గ్రామాల సమాహారంగా కాకుండా విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలన్నారు. అందుకు తగిన విధంగా ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల ప్రాజెక్ట్ పనులు జరగాలన్నారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపుపైనా దృష్టిపెట్టాలని సూచించారు. తాను కూడా స్వయంగా ఇకపై రాజధాని పనులను పరిశీలిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సీఎస్ సాయిప్రసాద్, ఉన్నతాధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రశ్న పత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

● చర్యలు తీసుకోకపోవడం వల్లనే సీబీఎస్ఈకి విస్తరించిన గ్లోబరీనా అక్రమాలు ● కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు ● హైడ్రా పనులు భవిష్యత్‌లోనూ కొనసాగిస్తుంది... ● ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**ఢిల్లీ,జూలై 28 (వార్తాప్రభ) :** ప్రశ్న పత్రాల లీకేజీలకు కారణమైనవాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలో దేశస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేది చూస్తామని సీఎం ఒక ప్రశ్నకు బదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనా వటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షల వరకు విస్తరించి, వాటిని గందరగోళం చేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలమీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్నవాళ్లకు బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీ వంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్నట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమవుతాయని సీఎం అన్నారు. క్రమం తప్పకుండా వాటిని చెల్లించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, కుంటలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ పార్కులను కబ్జాలు పెట్టుకున్నోళ్లు కోర్టులను తప్పుదోవ పట్టించి కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.

# కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలి

● ఎల్ నినో యాక్షన్ ప్లాన్ అమల్లో నిర్లక్ష్యాన్ని సహించను
● తాగునీటి సమస్య తలెత్తకూడదు
● ప్రతి పంటకు బీమా నమోదు చేయించే బాధ్యత కలెక్టర్లదే
● నిరంతరం మానిటరింగ్ చేసేలా ఎల్ నినో కంట్రోల్ రూమ్
● ఎల్ నినోపై క్షేత్ర స్థాయి అంచనాలు... ప్రణాళికలు ఉండాలి
● ఏడాదికి సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ప్రణాళికలు
● ఎల్ నినోపై ఆర్ఎస్కేల స్థాయిలో ఇంప్లిమెంటేషన్ కమిటీలు
● ఆగస్టు 3 నుంచి ఎల్ నినోపై అవగాహన కార్యక్రమాలు




**అమరావతి, జూలై 28 (వార్తాప్రభ) :** ఎల్ నినో కష్టకాలంలో రైతులను ఆదుకోవాలని... వారికి సరైన సమాచారాన్ని సహకారాన్ని అందిస్తూ అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఎల్ నినో ప్రభావం ఏ మేరకు ఉంటుంది... దీనికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ వంటి అంశాలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. జూలై నెలలో 69 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు... జూన్ -- నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఉన్న అంచనాల ప్రకారం అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని అధికారులు చెప్పారు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరిపై ప్రభావం చూపిస్తుందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. వంశధార నుంచి జలాలు అందుబాటులోకి వస్తే వాటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలను కాపాడాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించామని అధికారులు సీఎంకు వివరించడంతో... హై రిస్క్ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఆగస్ట్ 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి, అత్యవసర విత్తన ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కంది, ఆముదం, మినుము పంటలను ఇప్పటికే కొందరు ప్రత్యామ్నాయ పంటలుగా వేస్తున్నారని చెప్పారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఈ నెల 31వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నామని... అయితే వరి పంటకు ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు వివరించారు. ఇప్పటి వరకు 6.30 లక్షల హెక్టార్ల మేర పంటలను బీమాలో నమోదు చేశామని అధికారులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ... వేసిన ప్రతి పంటకు బీమా నమోదు చేయాల్సిందేనని... ఏ పంటకైనా బీమా నమోదు చేయకపోతే... దానికి కలెక్టర్లే బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అలాగే తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పశు గ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. 5 నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉంచామని అధికారులు చెప్పారు. అయితే 5 నెలలకు సరిపడా పశుగ్రాసం సిద్ధం చేసుకుంటే సరిపోదని... ఎల్ నినో ప్రభావం ఏడాది పొడవునా కన్పించే సూచనలు ఉండడంతో ఏడాదికి అవసరమైన పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**ఎల్ నినోపై ప్రతివారం నివేదికలు..** ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ఎల్ నినో ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలి. వరదలు, తుఫాన్లు వచ్చినప్పుడు ఎలా మానిటర్ చేశారో... అదే విధంగా ఎల్ నినో అంశాన్ని మానిటర్ చేయాలి. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి... వచ్చిన డేటాను విశ్లేషించాలి.. విశ్లేషించిన డేటా ఆధారంగా సూచనలివ్వాలి.. వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసేలా రైతు సేవా కేంద్రాల సిబ్బందిని అప్రమత్తం చేయాలి. ఏయే ల్యాండ్ పార్శిళ్లల్లోని పంటలకు ఇబ్బందులో గమనించాలి. అక్కడ బోర్లు ఏమైనా అందుబాటులో ఉన్నాయా..? అనే సమాచారంతో రైతులకు సరైన గైడెన్స్ ఇచ్చేలా వ్యవస్థలను ఉపయోగించుకోవాలి. అలాగే సదురు ప్రాంతంలో భూగర్భ జలాల పరిస్థితిని కూడా తెలుసుకోవాలి.

# భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయండి

● ప్రధాని పర్యటన విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

● భోగాపురంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ సమీక్ష



**భోగాపురం,జూలై 28 (వార్తాప్రభ) :** విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రధాని పర్యటన విజయవంతానికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఆగష్టు 1వ తేదీన రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై భోగాపురం విమానాశ్రయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే.రామ్మోహన్ నాయుడుతో కలిసి అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారుల పనులు, పార్కింగ్, టెర్మినల్ బిల్డింగ్, బహిరంగ సభ వేదిక, భద్రత, జనసమీకరణ, ప్రోటోకాల్ గ్యాలరీ, భోజనం, రవాణా ఏర్పాట్లపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి నారా లోకేష్ పలు సూచనలు చేశారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి 32 నియోజకవర్గాల నుంచి దాదాపు 3 లక్షల మంది హాజరవుతారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. బహిరంగ సభ వేదికలో వీవీఐపీ సీటింగ్ సామర్థ్యాన్ని 520 నుంచి వెయ్యికి పెంచామని, వీఐపీ 3వేలు, వెయ్యి మంది ఛాంపియన్స్, విమానాశ్రయానికి భూములు ఇచ్చిన వారు ఆసీనులయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల కోసం ప్రధాన రహదారికి ఇరువైపులా 20 భోజనం కౌంటర్లు ఏర్పాటుచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని మంత్రి లోకేష్ సూచించారు. విద్యార్థుల విషయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అంబులెన్స్ లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# ఎల్ నినో నుంచి రైతులను ఆదుకోండి

● సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించిన సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



**అమరావతి,జూలై 28 (వార్తాప్రభ) :** ఎల్ నినో కారణంగా తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. కె.రామ కృష్ణ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 54 శాతం తక్కువగా వం-ర్షపాతం నమోదైందని, 249 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన వివరించారు. అదే విధంగా మంచినీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని రామకృష్ణ ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ... ప్రభుత్వం ఇప్పటికే ఎల్ నినో సమస్యపై దృష్టి సారించిందని, ఆగస్ట్ 3 నుంచి అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా ఉండేలా యంత్రాగానికి ఆదేశాలు జారీ చేశామని సీఎం అన్నారు. ప్రభుత్వం దృష్టికి రామకృష్ణ తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు.

# భావి వైద్యుల్లో ప్రతిభా వికాసానికి డా. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మరో వినూత్న అడుగు

● తొలిసారిగా 'ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్--2026' కర్టెన్ రైజర్
● ఆగస్టు 12--14 వరకు ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో రాష్ట్రస్థాయి సాంస్కృతిక మహోత్సవం
● విద్యతో పాటు సృజనాత్మకత, నాయకత్వం, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యత..
● ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్



**విజయవాడ, జూలై 28 (వార్తాప్రభ) :** విద్యార్థుల సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం (డా. ఎన్టీఆర్ యూహెచ్ఎస్), విజయవాడ తొలిసారిగా నిర్వహిస్తున్న లి'ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్--2026'లి కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ మంగళవారం విశ్వ విద్యాలయంలో సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభ, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి విశ్వవిద్యాలయం సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనుబంధ మెడికల్, డెంటల్ కళాశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవడానికి, పరస్పరం అనుభవాలను పంచుకోవడానికి, ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించుకోవడానికి ఈ ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్--2026 ఉత్తమ వేదికగా నిలుస్తుందన్నారు. తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక మహోత్సవం భావి వైద్యుల్లో ప్రతిభను వెలికితీయడమే కాకుండా సృజనాత్మకత, స్నేహభావం, ఐక్యత, సాంస్కృతిక విలువలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమం విశ్వవి ద్యాలయం ప్రతిష్ఠాత్మక వార్షిక వేడుకగా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు.

# రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం

-ఉప సభాపతి,అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణ రాజు



**అమరావతి,జూలై 28 (వార్తాప్రభ) :** విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో దాదాపు రూ.2000 కోట్లు విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తామని ఉప సభాపతి మరియు అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘు రామకృష్ణ రాజు వెల్లడించారు.మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన అధ్యక్షతన ఫిర్యాదుల కమిటీ సమావేశం జరిగింది.అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామ కృష్ణ రాజు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు.ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు మరియు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్-కార్డులు(రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు.దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు,బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు,కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు తో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహిం చారు. ఈమీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి-16 కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు.అదే విధంగా స్టీల్ ప్లాంట్ కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్-కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్ లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు. ఇంకా ఈసమావేశంలో కమిటీ సభ్యులు మరియు శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు.


## CHANGE OF NAME

I, PAGADALA LAASYA (Old Name), D/o. Pagadala Pulla Rao, R/o. D.No. 4-160, Opposite Sachivalayam Road, Kethanakonda Village, Ibrahimpatnam Mandal, NTR District – 521456, Andhra Pradesh, India. I have changed my name as PAGADALA LUCKY (New Name), D/o. Pagadala Pulla Rao. Hereafter my name is known as PAGADALA LUCKY (New Name), D/o. Pagadala Pulla Rao.

## తిరువూరు శాసనసభ్యునికి భారీ స్వాగతం పలికిన మండల అధికారులు



**విస్సన్నపేట,జూలై 28 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ఆంధ్రకేసరి ఎఫ్ బి ఓ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ ఆదేశాలతో సన్న చిన్నకారు రైతులకు ట్రాక్టర్ వినియోగానికి కావలసిన వ్యవసాయ సంబంధిత అన్ని రకాల పనిముట్లు అద్దెకు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు రావడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం సంబంధిత కార్యాలయంలో ట్రాక్టర్ ట్రక్కు కల్టివేటర్ తదితర సామాగ్రిని రైతన్నల వినియోగించుకునేందుకు మంగళవారం ఉదయం గ్రీన్ రిబ్బన్ కట్ చేసి తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రారంభంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు, మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి , ఏపీఎం జమలయ్య సిసి రమేష్ కూటమి పార్టీల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ జీవనోపాదులపై జి సి ఎఫ్ సహకారంతో శిక్షణ కార్యక్రమం



**కోడూరు,జూలై 28 (వార్తాప్రభ) :** కోడూరు మండలంలో 50 మంది స్వయం సహాయక సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ పథకంలో కొన్ని పథకాలకు 60% లబ్ధి పొందడం జరుగుతుందని 1. పీతల పెంపకం 2. సముద్రపు నాచు 3. రంగుల చేపల పెంపకం గురించి తెలియజేశారు. ఆసక్తి కలవారు నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. జి సి ఎఫ్ డిస్టిక్ కోఆర్డినేటర్ బి. ప్రభాకర్ మాట్లాడుతూ, పీతల పెంపకం, సముద్రపు నాచు, రంగు చేపల పెంపకం గురించి సంపూర్ణ అవగాహన కల్పించారు. ఆసక్తి కలిగిన సభ్యులు తమ వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందాలని , జీవన ఉపాధి ఏర్పాటు ద్వారా కుటుంబ అధిక ఆదాయం ఏర్పాటు చేసుకోవాలని, ఎఫ్ పి ఓ ద్వారా పంట సేకరణ,గ్రేడింగ్ ,ప్యాకింగ్ చేసి అధిక ఆదాయం పొందాలని, ఒక్కొక్క కుటుంబం 5,6, జీవనోపాదులు కలిగి ఉండాలని తెలిపారు. ఫిషరీష్ కార్యక్రమాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సిఐఎఫ్,అంతర్గత లోన్లు ఉపయోగించుకోవాలని, ఉద్యమ రిజిస్ట్రేషన్ ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు

## మందపాకల మాజీ సర్పంచ్ శివ ప్రసాద్ కు నివాళులర్పించిన జడ్పిటిసి యాదవ రెడ్డి



**కోడూరు,జూలై 28 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని మందపాకల గ్రామం మాజీ సర్పంచ్, వైసీపీ సీనియర్ నాయకులు అద్దంకి శివప్రసాద్ మృతి పట్ల కోడూరు జడ్పిటిసి సభ్యులు యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.శివప్రసాద్ భౌతికయానికి జెడ్పిటిసి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గ్రామ సర్పంచిగా మందపాకల గ్రామ అభివృద్ధిలో ప్రధాన పాత్ర వహించారని తెలిపారు. ఎంపిటిసిలు బడే హేమగంగాధర్రావు, తిమ్మన వెంకట నాంచారయ్య, కోట పద్మావతి వరప్రసాద్, వెన్న ప్రసాద్, బండె నాగరాజు తదితరులు ఉన్నారు. అనంతరం కోడూరు గ్రామంలోని మైక్ సెట్ బుజ్జిగా పేరుగాంచిన దావు బుజ్జి మృతి చెందడంతో బుజ్జి మృతదేహానికి జెడ్పిటిసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## భెరాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,జూలై 28 (వార్తాప్రభ) :** మాదాపూర్ డివిజన్ గోకుల్ ఫ్లాట్స్ కాలనీలోని బెరాకా ప్రార్థన మందిరంలో బెరాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో,ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడం అభినందనీయమని అన్నారు. ఒకే వేదికపై గుండె, క్యాన్సర్, ఈసీజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థో, చర్మ, నేత్ర,దంత,ఈఎన్టీ తదితర విభాగాలకు చెందిన వైద్యులతో పరీక్షలు నిర్వహించి,ఉచిత మందులు, అవసరమైన వారికి కళ్లజోడులు అందించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ప్రజలు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సీజ నల్ వ్యాధులు నివారించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ యేసుపాదం, సత్యరాజ్, లక్ష్మ ణ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీనివాస్, గుమ్మడి శ్రీనివాస్, పితాని శ్రీనివాస్, పూర్ణతో పాటు వైద్యులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆషాడ సారె సమర్పణ...



**గుడ్లవల్లేరు,జూలై 28 (వార్తాప్రభ) :** మండల కేంద్రంలోని కొలువైయు న్న శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో అమ్మవారికి యార్లగడ్డ సత్యనారాయణ, తులశమ్మ దంపతులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆషాడ సారెను సమర్పించారు. సాంప్రదాయ పద్ధతిలో స్వీట్లు, పండ్లు, పూలు, చలిమిడి, గోరింటాకు మొదలైన అన్ని రకాల వస్తువులను తీసుకుని పేరంటాళ్లు, మేళతాళాలతో భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారెను సమర్పించారు.

# ఇచ్చిన హామీ నెర వేర్చుకున్న ఉపాధ్యాయుడు

### విద్యార్థిని ఉన్నత చదువులకు చేయూత



**పల్నాడు,జూలై 28 (వార్తాప్రభ) :** పల్నాడు జిల్లా యల్లమంద గ్రామంలోని ఎంపీపీ(ఎస్సీ) పాఠశాలలో ఈ నెల 24వ తేదీన నిర్వహించిన మెగా పీటీఎం సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థిని పెళ్లూరి యమున పదో తరగతిలో 527 మార్కులు సాధించినప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా పై చదువును కొనసాగించలేని పరిస్థితి ఉన్నట్లు గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయుడు కామినేని పెద్దబ్బాయి ఆ విద్యార్థిని ఇంటర్మీడియట్ విద్య పూర్తయ్యే వరకు అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జే. రామారావు , అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి. శ్యాం ప్రసాద్ వెంటనే స్పందించి, విద్యార్థిని ని కేజీబీవీ నాదెండ్లలో ఇంటర్మీడియట్లో చేర్పించాలని ఆదేశించారు.దీంతో, మంగళవారం ఉపాధ్యాయుడు కామినేని పెద్దబ్బాయి విద్యార్థినికి హాస్టల్లో అవసరమైన వస్తువులను సమకూర్చి, ఆమె తల్లిదండ్రులతో కలిసి కేజీబీవీ నాదెండ్లలో ఇంటర్మీడియట్లో విజయవంతంగా చేర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జే. రామారావు, ఏపీసీ . పి శ్యాం ప్రసాద్ ,ఉపాధ్యాయుడు కామినేని పెద్దబ్బాయి లకు కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి చేసిన ఈ చొరవ ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని స్థానిక ప్రజలు , పలువురు గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

## చేయి కోల్పోయిన దివ్యాంగులకు ఉచితంగా అత్యాధునిక ఎల్ఎన్--4 కృత్రిమ చేతులు




**విజయవాడ,జూలై 28 (వార్తాప్రభ) :** చేయి కోల్పోయి జీవనోపాధి కోల్పోయిన పేద, నిరుపేద దివ్యాంగులకు అత్యాధునిక ఎల్ఎన్--4 (LN4) కృత్రిమ చేతులను పూర్తిగా ఉచితంగా అందించే "చేయూత" కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. సమ రం పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ, రోటరీ డిస్ట్రిక్ట్ 3020, రోటరీ డిస్ట్రిక్ట్ 3150 సంయుక్త ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న "చేయూత" కార్యక్రమం వివరాలను మంగళవారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జి. సమ రం, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు రొటేరియన్ ఎస్. రవి ప్రకాష్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అత్యాధునిక ఎల్ఎన్--4 కృత్రిమ చేయి కొనుగోలు చేయలేని పేద దివ్యాంగులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కృత్రిమ చేయి ద్వారా రోజువారీ పనులు చేసుకోవడంతో పాటు ఉపాధి అవకాశాలను తిరిగి పొందుతూ ఆత్మవిశ్వాసంతో జీవించే అవకాశం కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 2న గుంటూరులో, ఆగస్టు 16న విజయనగరంలో, ఆగస్టు 30న అనంతపురంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మోచేయి కింది భాగంలో కనీసం నాలుగు అంగుళాల మిగులు చేయి ఉన్న చేయి కోల్పోయిన దివ్యాంగులు ఈ కార్యక్రమానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అర్హులైన దివ్యాంగులు ముందస్తుగా తమ పేర్లను 8866306969 నంబర్కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని డాక్టర్ జి. సమరం, రొటేరియన్ ఎస్. రవి ప్రకాష్ విజ్ఞప్తి చేశారు.

# బాపులపాడులో '2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం.. ఇంటింటికీ ప్రభుత్వ పథకాల ప్రచారం

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- రైతులకు రూ.1.68 కోట్లతో మోటార్ల పంపిణీ చేసినట్లు వెల్లడి
- సాగునీటి ప్రాజెక్టులకు రూ.74 కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రకటన





**హనుమాన్ జంక్షన్,జూలై 28 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న '2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సోమవారం బాపులపాడు గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. తారకరామనగర్లోని 212వ బూత్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి బూత్ స్థాయిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బాపులపాడు పీహెచ్సీ పరిధిలో ఇప్పటికే 2,700 మందికి, నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 25 వేల మందికి రక్తపరీక్షలు నిర్వహించామని, మిగిలిన వారికి కూడా త్వరలో పరీక్షలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతుల సమస్యలపై రాజకీయాలు చేయడం సరికాదని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతులకు పంపిణీ చేసిన మోటార్లను వెనక్కి తీసుకోవడం బాధాకరమన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా తన సొంత నిధులతో రూ.1.68 కోట్ల వ్యయంతో మోటార్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. గన్నవరం రైతాంగానికి శాశ్వత సాగునీటి పరిష్కారం కోసం పోలవరం కుడి ప్రధాన కాలువ--ఏలూరు కాలువ అనుసంధానానికి రూ.38 కోట్లు, ఎనికేపాడు అండర్టన్నెల్ విస్తరణకు రూ.36 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ పనులు పూర్తయితే సుమారు 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, మరో రెండు, మూడు రోజుల్లో నీటి విడుదల జరిగే అవకాశం ఉందన్నారు. గన్నవరం ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రచారం కోసం కాకుండా అభివృద్ధి కోసం శాసనసభలో పలుమార్లు సమస్యలను ప్రస్తావించి నిధులు సాధించామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జులై 30, 31 వ, తేదీలలో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి

**---సిఐటియు జిల్లా కార్యదర్శి, ఎ.కమల పిలుపు....**



**పెనుగంచిప్రోలు,జూలై 28 (వార్తాప్రభ) :** జులై 30వ తేదీన షెడ్యూల్ రంగాల కార్మికులైన పంచాయితీ, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు, జులై 31వ తేదీన స్కీం వర్కర్లు అయి- నఅంగన్వాడి ,ఆశ ,మధ్యాహ్నం భోజనం, కార్మికులు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, గ్రాట్యుటీ,పెన్షన్, పిఎఫ్ ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, లేబర్ కోడ్ లను రద్దు చేయాలన కోరుతూ పెద్ద ఎత్తున కార్మిక వర్గం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన తెలియజేయడానికి సిద్ధమవుతున్నారని ఆమె అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ సెంటర్ వరకు నినాదాలు చేస్తు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కమలా మాట్లాడుతూ , పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యవసర సరుకులు ధరలు పెరిగాయని, దీనికి అనుగుణంగా కార్మికుల వేతనాలు కూడా పెంచాలని ఆమె డిమాండ్ చేశారు.వేతనాలు పెంచి ఏడు సంవత్సరాలు అవుతున్నా ప్రభుత్వాలు కార్మికుల వేతనాలు పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా అనేక సంవత్సరాలుగా కార్మికుల పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ గా మార్చిందని, వీటిని మన రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి అమలకు పూనుకోవడం దుర్మార్గం అని ఆమె అన్నారు. లేబర్ కోడ్ లను అమలు చేయడం కార్మికుల వేతనాలపైన సామాజిక భద్రతపైన దాడి జరుగుతుందని సంగం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు లేకుండా చేయటం పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ వంటి సంక్షేమ పథకాలకు ఎగనామం పెట్టడం వంటివి జరుగుతాయి అన్నారు. కార్మికుల హక్కులను హరిస్తున్న, ఈ నాలుగు లేబర్ కోడ్లను ప్రభుత్వాలు రద్దు చేయాలంటే కార్మికులందరూ ఐక్యంగా ప్రకటించాలని ఆమె పిలుపునిచ్చారు. అంతేకాకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26,000 అమలు చేయకుండా, కార్మికుల యొక్క శ్రమను దోచుకుంటున్నారని, కార్మికులు సమస్యల పట్ల ప్రభుత్వాలు చిత్తశుద్ధి లేదని ప్రభుత్వాలు మారుతున్నా కానీ పాలకుల విధానాలను మాత్రం మారడం లేదని ఆమె ఆరోపించారు. ఈ ప్రమాదాన్ని కార్మికులు అర్థం చేసుకోకపోతే నష్టపోతారని, ఈ నేపథ్యంలో కనీస వేతనాలు పెంపు లేబర్ కోట్ల రద్దు కై అందరూ కలిసి జూలై 30, 31 తేదీల్లో విజయవాడ కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమంలో కార్మికులు అందరూ పెద్ద ఎత్తు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు సిఐటియు మండల కన్వీనర్ ధారా నాగేశ్వరరావు, పంచాయతీ వర్కస్ యూనియన్ నాయకులు పంద్ర కోల . రాంబాబు, గుజర్ల పూడి గోపి, దుంపల .గోపాలరావు , బొడ్డు నాగరాజు, తుమ్మల గోపి రైతు సంఘం నాయకులు వై. రామారావు, కౌలు రైతు సంఘం నాయకులు వి. గురవయ్య ,ఆశా వర్కర్లు మధ్యాహ్న భోజన వంట వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## రంగన్నగూడెంలో ఇంటింటికి "రెండేళ్ల నమ్మకం" ప్రచారం



**హనుమాన్ జంక్షన్,జూలై 28 (వార్తాప్రభ) :** రంగన్నగూడెం గ్రామంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన "ఇంటింటికి రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం" ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీల అమలు, సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాగే గన్నవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు కృషితో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు పల్లగాని వీరాంజనేయులు, ఎంపిటీసీ సభ్యుడు పుసులూరు లక్ష్మీనారాయణ, ఎంపీసీఎస్ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు, బూత్ లెవల్ ఏజెంట్ కసుకుర్తి వేణుబాబు, టీడీపీ నాయకులు తుమ్మల దశరథ రామయ్య, కసుకుర్తి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## వీరవల్లి శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి మహోత్సవం

- శాకంబరి అలంకారంలో దుర్గాదేవి దర్శనం



**హనుమాన్ జంక్షన్,జూలై 28 (వార్తాప్రభ) :** వీరవల్లిలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఈ నెల 29న విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 6:30 గంటలకు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమై, అనంతరం సాయిబాబా వారికి నవఫల రసాలు, పంచామృతాలతో మహా అభిషేకం, గురుపాదుకా పూజ, పుష్పార్చన నిర్వహిస్తారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీ దుర్గాదేవి అమ్మవారిని శాకంబరి అలంకారంలో అలంకరించి ప్రత్యేక కుంకుమార్చన చేపడతారు. ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా భక్తులందరూ పూజా కార్యక్రమాల్లో పాల్గొని, శ్రీ సాయిబాబా, అమ్మవారిని దర్శించుకుని, అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించి దివ్య ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## మేము ఉన్నప్పుడు ఇలా జరిగిందా?

- ఆడపడుచుల ఇబ్బందులు పరిష్కరించండి!
- మాజీ వార్డ్ మెంబర్ లకు పవన్



**విస్సన్నపేట,జూలై 28 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో గత వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో సర్పంచ్ గా సాదుపాటి నాగమల్లేశ్వరి ఎన్నిక కావడం జరిగింది. మూడవ వార్డు మెంబర్ గా ఎనిమిది వందల ఓట్లకు 186 ఓట్లు మెజార్టీతో ఓటర్ దేవుళ్ళ ఆశీస్సులతో గెలుపొందడం జరిగిందని తమ బాడీ ఉండగా రెండు పూటలా త్రాగునీరు అందించామని ప్రస్తుతం ఒక పూట కూడా సరిగా రావడం లేదని ఆయన చెప్పారు. ఒకవైపు త్రాగునీరు సరఫరాకు సమయపాలన లేదు మరోవైపు పద్మశాలి వీధిలోనే శ్రీ పద్మావతి సమేత భావన ఋషి స్వామి వారి దేవాలయం దగ్గర ఉన్న కొట్టుడు బోరు చెడిపోయి వంద రోజులు దాటుతున్న పట్టించుకునే నాథుడు లేడని ఒక వైపు త్రాగునీరు మరోవైపు వాడుక నీరు సరఫరా లేక ఆడపడుచులు తిరువూరు ఇబ్బందులు గురవుతున్నారని ఆయన తెలియజేశారు. తమ జీవితకాలం అధికారం ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన చెప్పారు. మండు వేసవి సైతం రెండు పూటలా త్రాగునీరు అందించటం జరిగిందని వర్షాలు పడుతున్న నీటి సరఫరా కొరకు ఎదురు చూడవలసిన పరిస్థితి ఉన్నది అన్నారు. ఈ కార్యక్రమంలో పోలూరి సాంబశివరావు, చెరుకు శ్రీనివాసరావు పాల్గొన్నారు

## తిరువూరు ఒకటో వార్డులో ఇంటింటికి తెలుగుదేశం సంక్షేమ--అభివృద్ధి కార్యక్రమం



**తిరువూరు,జూలై 28 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలోని ఒకటో వార్డులో "ఇంటింటికి తెలుగుదేశం -- సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమం ఎమ్మెల్యే కొలికిపూడి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను ఇంటింటికీ చేరవేసే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు నాయకులకు తమ సమస్యలు, సూచనలు తెలియజేయగా, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కొలికిపూడి పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది..



**తిరువూరు,జూలై 28 (వార్తాప్రభ) :** నడిమి తిరువూరు లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏ డి ఏ ఎం.శ్రీనివాస రావు మాట్లాడుతూ రైతులందరూ ఖరీఫ్ 2026లో సాగుచేసిన అన్ని పంటలను తప్పనిసరిగా జు-పంట (డిజిటల్ క్రాప్ సర్వే) నందు నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలు అనగా పంట పేరు, వెరైటీ, విత్తిన/నాటిన తేదీ తదితర వివరాలను రైతు సేవా కేంద్ర సిబ్బందికి తెలియజేసి పంట నమోదు చేయించుకోవాలని కోరారు. పంట నమోదు వలన ప్రయోజనాలు 1. పంట ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు అమ్ముకొనుటకు ఉపయోగపడుతుంది 2. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారం పొందుటకు జు -పంట నమోదు తప్పనిసరి 3. సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ పొందుటకు 4. ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువులు పొందుటకు 5. ఇతర ప్రభుత్వ పథకాలకు వరి మినహా అన్ని పంటలకు పంటల బీమా చేయించుకొనుటకు ఆఖరు తేదీ 31.07.26 వరికి 15.08.2026. కావున ప్రత్తి వేసిన రైతులందరూ తప్పనిసరిగా ఎకరానికి 1900 రూపాయలు చెల్లించి గడువు పూర్తయ్యే లోగా పంటల బీమా పథకం నందు నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టాన్ని ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చడానికి పంటల బీమా తప్పనిసరి అని ఏవో తెలియచేశారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది అందరూ పంటల బీమా మరియు ఈ పంట నమోదు ఉపయోగాలు, ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు . ఈ కార్యక్రమంలో ఏవో పద్మ, ఏఈవో కావ్య సింధు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# గడువులోగా పనులు పూర్తి!!

- నాణ్యతే ప్రాధాన్యం ● పనుల్లో జాప్యం వద్దు
- మౌలిక వసతుల పరిశీలన ● అదనపు గదుల ప్రతిపాదనలు ● విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష





**పెద్దపల్లి జూలై 28 (వార్తాప్రభ):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టీయూఎఫ్ఐడీసీ, డీఎంఎఫ్టీ, ఇతర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. రామగుండం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పనుల పురోగతి, నిధుల వినియోగం, అమలు తీరును సమీక్షించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, ప్రతి పనిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.రామగుండం మండలం గోదావరిఖని విఠల్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా సందర్శించి విద్యా సౌకర్యాలు, భవనాల పరిస్థితి, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అదనపు తరగతి గదులు, మరమ్మతులు, ఇతర సౌకర్యాలపై సమగ్ర అంచనాలతో ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కు వివరాలు అందజేశారు.

### కాప్రా డివిజన్ గాంధీనగర్లో సిసి రోడ్డు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన...

## ఏఎంసి వైస్ చైర్మన్ విట్టల్ నాయక్.

**కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు శ్రీహరి.**



**కాప్రా, గాంధీనగర్, జూలై 28:(వార్తా ప్రభ)** కాప్రా గాంధీనగర్లో రూ20లక్షల నిధులతో చేపట్టినకాప్రా డివిజన్ గాంధీనగర్లో కమ్యూనిటీ హాల్ ఎదురుగా మరియు రీడింగ్ రూమ్ వద్ద సి సి రోడ్ల నిర్మాణం అభివృద్ధి పనులను పర్యవేక్షించిన ఏఎంసి వైస్ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, మరియు కాప్రా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తన్నీరు శ్రీహరి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన స్వల్ప కాలవ్యవధిలో వేలకోట్ల నిధులతో ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉమ్మడి కాప్రా డివిజన్లలో వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్న మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, రామలక్ష్మణుల్లా ఒకవైపు 50లక్షల నిధులతో ఫంక్షన్ హాల్ నిర్మాణం పనులు మరో వైపు 20లక్షల నిధులతో సి సి రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపడుతుండడంతో ఇద్దరు ప్రజా నాయకులకు ధన్యవాదములు తెలియజేసిన కాప్రా గాంధీ నగర్ కాలనీవాసులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నమోదులో విశేష సేవలు

**బీఆర్ఎస్ నాయకుడు రమణారావుకు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సత్కారం**

**516 బూత్ పరిధిలో 93 శాతం ఎన్యుమరేషన్ ఫారమ్‌లు పూర్తి చేసిన బిఎల్ఏ**

**చింతల్ క్యాంప్ కార్యాలయంలో శాలువాతో అభినందించిన ఎమ్మెల్యే**



**కుత్బుల్లాపూర్, జూలై 28, (వార్తాప్రభ) :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా 286 డివిజన్ కుత్బుల్లాపూర్ పరిధిలోని 516 బూత్ స్థాయి ఏజెంట్ (బిఎల్ఏ), బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రమణారావు విశేష కృషి చేశారు. తన బూత్ పరిధిలో ఏకంగా 93 శాతం ఓటరు ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సేకరించి, పూర్తి వివరాలతో బూత్ స్థాయి అధికారికి (బిఎల్ఓ) అందజేశారు. ఈ సందర్భంగా రమణారావు అందించిన సేవలను గుర్తిస్తూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రమణారావును శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ పిలుపునకు అనుగుణంగా ఓటర్ల నమోదు ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా పూర్తి చేసినందుకు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంట సిద్దిరాములు, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, బచ్చ జ్ఞానేశ్వర్, కాలే నగేష్, పోగు సమ్మయ్య నేత, బాలమల్లేష్, అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యాదవ సమాజ ఐక్యతే అఖిల భారత యాదవ మహాసభ లక్ష్యం

- అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్
- ఘనంగా అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం








**హైదరాబాద్, జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యాదవ సమాజ ఐక్యతే అఖిల భారత యాదవ మహాసభ లక్ష్యమని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్ పేర్కొన్నారు.అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర యువత అధ్యక్షులు గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్ అధ్యక్షతన స్థానిక సికింద్రాబాద్, ఓల్డ్ బోయిన్‌పల్లిలోని ఐ.కే. ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్, విశిష్ట అతిథులుగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల మల్లేష్ యాదవ్, రాష్ట్ర కోశాధికారి దారబోయిన శ్రీనివాస్ యాదవ్ లు ఆత్మీయ అతిథులుగా జాతీయ కార్యవర్గ సభ్యులు ఎస్ మహేంద్రనాథ్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి దొంతిబోయిన శ్రీనివాస్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మెయిల్కోల్ మహేంద్ర యాదవ్ హాజరై యువతకు విలువైన మార్గదర్శకత్వం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రాష్ట్ర యువజన కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర యువజన పదాధికారులు, జిల్లా యువజన అధ్యక్షులు, జిల్లా యువజన ఇన్‌చార్జిలు, సహ ఇన్‌చార్జిలు మరియు వివిధ జిల్లాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమావేశంలో జిల్లా యువజన కమిటీల ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించి, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు సంస్థను మరింత బలోపేతం చేయడానికి కార్యాచరణ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. జిల్లా యువజన ఇన్‌చార్జిలు, సహ ఇన్‌చార్జిల నియామకం, వారి బాధ్యతలు, జవాబుదారీతనం మరియు రాష్ట్ర--జిల్లా యువజన కమిటీల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేయడానికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.జాతీయ జనగణన--2026లో యాదవ సమాజానికి చెందిన ప్రతి కుటుంబం తమ కుల వివరాలను "యాదవ్" పేరుతో నమోదు చేయించుకునేలా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇందుకోసం పెద్దల కమిటీలతో సమన్వయం చేస్తూ యువజన జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.అదేవిధంగా, 2026--27 వార్షిక కార్యాచరణ ప్రణాళికకు తుది రూపు ఇచ్చారు. ఇందులో రక్తదాన శిబిరాలు, వృక్షారోపణ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, విద్యా మరియు యువజన అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా క్రమబద్ధంగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి జిల్లా వారీగా బాధ్యతలను కేటాయించి అమలు గడువులను కూడా ఖరారు చేశారు.ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ, "యాదవ సమాజ ఐక్యతే అఖిల భారత యాదవ మహాసభ లక్ష్యమని" పేర్కొంటూ, యువత సమాజ అభ్యున్నతిలో ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు. జాతీయ జనగణన--2026లో ప్రతి యాదవ కుటుంబం తప్పనిసరిగా "యాదవ్" పేరుతో నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేసి, సేవా కార్యక్రమాల ద్వారా సంస్థను ప్రజలకు మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దారబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత పెంపొందించడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. గ్రామ స్థాయి కమిటీల ద్వారా నిరక్షరాస్యత నిర్మూలన కోసం కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే సమాజ అభివృద్ధికి గణనీయమైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మెయిల్కోల్ మహేంద్ర యాదవ్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ప్రతి జిల్లాలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా యువత సంఘ బలోపేతానికి కృషి చేయాలని, ప్రతి కార్యక్రమంలో చురుకైన భాగస్వామ్యం వహించాలని సూచించారు. అదేవిధంగా, యాదవుల ఆత్మగౌరవ ప్రతీక అయిన సదర్ మహోత్సవాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే సదర్ నిధులు అన్ని జిల్లాలకు సమానంగా చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సదర్ ఉత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించి యాదవుల ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

**అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ** రాష్ట్ర యువత అధ్యక్షులు గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ "యువతే సంస్థకు భవిష్యత్తు" అని పేర్కొంటూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లా యువజన కమిటీ కార్యాచరణలో చురుకుగా పాల్గొని, సమాజ హక్కుల సాధన, యువత సాధికారత మరియు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా యువతను సంఘటితం చేసి సంస్థను మరింత బలోపేతం చేయడమే యువజన విభాగం ప్రధాన లక్ష్యమని తెలిపారు.సమావేశంలో రాష్ట్ర యువజన పదాధికారులు, జిల్లా యువజన అధ్యక్షులు, యువజన కార్యవర్గ సభ్యులు పలు నిర్మాణాత్మక సూచనలు చేసి, సంస్థ అభివృద్ధికి అవసరమైన పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను త్వరితగతిన అమలు చేయాలని సంకల్పించి, కృతజ్ఞతా సభతో సమావేశం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు మరియు వారి కార్యవర్గ సభ్యులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఉచిత నేత్ర వైద్య శిబిరం!!

- ఐ టెస్టులో పాల్గొన్న కృష్ణవేణి వికాస్ కళాశాల విద్యార్థులు ● దృష్టి లోపాలను ముందే గుర్తించాలి మొబైల్ వినియోగంతో కంటి సమస్యలు ● కంటి ఆరోగ్యమే భవిష్యత్‌కు బలం ● డిజిటల్ స్క్రీన్లను అతి తక్కువగా చూడాలి - డాక్టర్ భవ్య





**పెద్దపల్లి జూలై 28 (వార్తాప్రభ):** విద్యార్థుల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు దృష్టి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్యం అందించాలనే లక్ష్యంతో మంగళవారం గోదావరిఖనిలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో, డాక్టర్ భవ్య ఐ హాస్పిటల్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ప్రముఖ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ భవ్య విద్యార్థులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి సమస్యలను గుర్తించి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీడియాతో మాట్లాడుతూ నేటి కాలంలో చిన్నారులు, విద్యార్థులు మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు అధికంగా వినియోగించడం వల్ల కంటి సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని సూచించారు. దృష్టి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, సరైన కంటి సంరక్షణ అలవాట్లతో అనేక సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఇలాంటి ఉచిత నేత్ర వైద్య శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో కంటి సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించడం, సరైన కంటి సంరక్షణ పద్ధతులను వివరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. చదువుకునే వయస్సులో కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రౌతు గణేష్ కుమార్, కామెర శ్రీనిత్, కోలేటి విశాల్, మీస వికాస్ కళాశాల చైర్మన్ డాక్టర్ నాగండ్ల జమున రవికుమార్, ప్రిన్సిపాల్ వెంకన్న, లెక్చరర్లు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.

# ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నేత లెనిన్ బాబు

**గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే**

**నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ**



**కుత్బుల్లాపూర్, జూలై 28, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి చేరికల జోరు కొనసాగుతోంది. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు లెనిన్ బాబు కాంగ్రెస్‌ను వీడి, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లెనిన్ బాబుకు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి సంక్షేమ ఫలాలను చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, కుంట సిద్దిరాములు, బచ్చ జ్ఞానేశ్వర్, కాలే నగేష్, పోగు సమ్మయ్య నేత, గణేష్, బాలమల్లేష్, రమణారావు, అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్

## చాలీసా పారాయణంలో రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా

**-హనుమాన్ చాలీసా పారాయణం అందరికీ శ్రేయస్కరం... మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్.**



**జవహర్ నగర్, జూలై 28:(వార్తా ప్రభ)** సదాచారి గురుస్వామి ఆధ్వర్యంలో మూడవ రోజు నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా కార్యక్రమానికి కీసర సర్కిల్ జవహర్ నగర్ నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఐదు రోజులు ప్రతిరోజు 108 హనుమాన్ చాలీసా పారాయణాలు చేయాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం. జవహర్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలందరికీ ఎంతో శ్రేయస్కరమని అన్నారు. ఈ కార్యక్రమానికి వర్షం కారణంగా అంతరాయం కలిగినప్పటికీ హనుమాన్ చాలీసా పారాయణాన్ని సదా చారి గురుస్వామి వారి బృందం నిరాశ నిస్పృహలకు గురి కాకుండా ఉత్సాహంగా చాలీసా పారాయణాన్ని కొనసాగించడం ఎంతో గర్వించదగ్గ విషయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో రమేష్ చారి, విజయ్, మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ పునర్నిర్మాణం పనుల కోసం 51 వేల రూపాయలు విరాళంగా అందజేసిన...

## మాజీ జెడ్పీటిసి ముప్పు రామ్ రెడ్డి.

**నాగారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి.**



**కీసర, నాగారం, జూలై 28:(వార్తా ప్రభ)** మెడ్చల్ నియోజకవర్గం, పోచారం డివిజన్ పరిధిలోని ప్రతాప్‌సింగారం గ్రామంలో మెడ్చల్ కాంగ్రెస్ మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ భవాని చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా కీసర మండల మాజీ జడ్పీటీసీ ముప్పు రామ్ రెడ్డి మరియు నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆలయ పునర్నిర్మాణం పనుల కోసం 51,000 రూపాయలు విరాళంగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొక్కా ప్రభాకర్ రెడ్డి, గణపురం కొండలరెడ్డి పొట్టా పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకుడు మాశెట్టి అనిల్ కుమార్ గుప్తా



**మల్కాజ్‌గిరి : జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని గౌతమ్‌నగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, గౌతమ్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మా శెట్టి అనిల్ కుమార్ గుప్తా మంగళవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తున్న పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు చోటుచేసుకుని పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో చేరిన మా శెట్టి అనిల్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలకు ఆకర్షితుడై బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. త్వరలో తన అనుచరులు, స్నేహితులతో కలిసి మరింత మంది నాయకులు, కార్యకర్తలను బీఆర్ఎస్‌లో చేరుస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, బైరు అనిల్, హేమంత్ పటేల్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, నర్సింగ్, గౌస్ ఇమ్రాన్ ,జక్కుల కిరణ్ ముదిరాజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఉత్తరాంధ్ర భవితకు గగనద్వారం... భోగాపురం!

**పెట్టుబడులు... పరిశ్రమలు... పర్యాటకం...**
**ఉపాధికి కొత్త ఊపు!**
**కలలకు కొత్త రన్‌వే... అభివృద్ధికి గగనమార్గం!**

ఎయిర్‌పోర్టులు కేవలం విమానాల రాకపోకల కేంద్రాలు కావు. అవి దూరాలను దగ్గర చేసే అద్భుత వారధులు... అవకాశాలను ప్రపంచంతో అనుసంధానించే అభివృద్ధి ద్వారాలు. ప్రతి టేకాఫ్ ఒక కొత్త ఆశయానికి శ్రీకారం చుడితే, ప్రతి ల్యాండింగ్ సొంత నేలను చేరుకున్న ఆనందాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక ప్రాంతాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టే శక్తి ఉన్న ఈ వైమానిక సౌకర్యం, ఇప్పుడు ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ సాకారమవుతోంది.

**దూరదృష్టి ఫలితం... భోగాపురం!** భవిష్యత్ అవసరాలను వర్తమానంలోనే గుర్తించి, అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేయడం దార్శనిక నాయకత్వానికి నిదర్శనం. అదే దూరదృష్టితో ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, దశాబ్దం క్రితమే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ఆలోచనకు శ్రీకారం చుట్టారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఆనాడు వేసిన బలమైన పునాదుల ఫలితంగానే, నేడు ఈ బృహత్ ప్రాజెక్టు రూపం దాల్చింది. విశాఖపట్నానికి సమీపంలోని భోగాపురంలో అద్భుతంగా నిర్మితమైన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. దీంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలుకానుంది.

**భోగాపురం... ఆర్థికాభివృద్ధికి కొత్త ఇంజిన్!** భోగాపురం విమానాశ్రయం కేవలం ఒక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు మాత్రమే కాదు. ఇది ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపునిచ్చే పవర్‌హౌస్. పెట్టుబడులు, పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, లాజిస్టిక్స్, సేవారంగాల విస్తరణకు ఇది ప్రధాన వేదికగా మారనుంది.

**ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం..** భోగాపురం--విశాఖపట్నం ప్రాంతం రాబోయే దశాబ్దంలో తూర్పు తీరంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అగ్రగామి వాణిజ్య కేంద్రంగా అవతరించనుంది.

**వేల కోట్ల పెట్టుబడుల గమ్యస్థానం:** ఏరోసిటీవిమానాశ్రయం చుట్టూ అభివృద్ధి చెందనున్న అత్యాధునిక ఏరోసిటీ ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయనుంది.

**వ్యాపార, పారిశ్రామిక రంగాలు:** ఐటీ ఉ ఐటీఈఎస్ పార్కులు, లాజిస్టిక్స్ హబ్స్, కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు.

**వసతి , ఆతిథ్యం:** స్టార్ హోటళ్లు, కార్పొరేట్ ఆసుపత్రులు, కన్వెన్షన్ సెంటర్లు, రిటైల్ హబ్‌లు.

**విద్యా , ఇతర రంగాలు:** ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు. ఈ మౌలిక వసతుల కారణంగా రానున్న పదేళ్లలో వేల కోట్ల రూపాయల ప్రైవేటు పెట్టుబడులు ఈ ప్రాంతానికి తరలివస్తాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్‌గా ఉత్తర్యాంధ్ర** విశాఖపట్నం, గంగవరం పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్‌తో భోగాపురం విమానాశ్రయం అనుసంధానం కావడం వల్ల సముద్ర, రోడ్డు, వైమానిక రవాణా ఒకే వేదికపైకి రానుంది.

**ఎగుమతి కానున్న ప్రధాన వస్తువులు:** ఫార్మా ఉత్పత్తులు, సముద్ర ఆహారాలు, వ్యవసాయ-ఉద్యాన పంటలు, తాజా పండ్లు, పూలు, హస్తకళలు మరియు ఎలక్ట్రానిక్ వస్తువులు ఇకపై దేశవిదేశాలకు మరింత వేగంగా ఎగుమతి కానున్నాయి.

**పర్యాటక రంగానికి కొత్త రెక్కలు** భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశీయ, విదేశీ పర్యాటకుల రాకపోకలు విపరీతంగా పెరుగుతాయి.

**ప్రధాన పర్యాటక ప్రాంతాలు:** విశాఖ బీచ్‌లు, అరకు లోయ, బొర్రా గుహలు, భీమిలి, యారాడ బీచ్, కైలాసగిరి, తోటలకొండ, బావికొండ, సింహాచలం తదితర ప్రాంతాలకు పర్యాటక తాకిడి మరింత పెరుగుతుంది. దీనివల్ల హోటళ్లు, రిసార్టులు, హోమ్‌స్టేలు, ట్రావెల్ ఏజెన్సీలు, క్యాబ్ సర్వీసులు మరియు స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా లభిస్తాయి.

**యువతకు భారీగా ఉపాధి అవకాశాలు** విమానాశ్రయం నిర్మాణం నుంచి నిర్వహణ వరకు ప్రతి దశలోనూ వేలాది ఉద్యోగాలు సృష్టించబడతాయి.

**ప్రత్యక్ష ఉద్యోగాలు:** గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో సేవలు, భద్రతా విభాగం, ఏవియేషన్ ఇంజినీర్లు, టెక్నీషియన్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సేవలు.

**పరోక్ష ఉద్యోగాలు:** ఆతిథ్య రంగం రవాణా, గిడ్డంగులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ మరియు రిటైల్ రంగాలలో స్థానిక యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుంది.

**భోగాపురం విమాన్యాశ్రయం - ముఖ్యాంశాలు**మొదటి దశ ప్రయాణికుల సామర్థ్యంఏడాదికి 60 లక్షల మంది. భవిష్యత్ విస్తరణ సామర్థ్యం ఏడాదికి 1.8 కోట్ల మంది వరకుమొత్తం విస్తీర్ణం సుమారు 2,200 ఎకరాలు
మొదటి దశ పెట్టుబడి రూ. 4,500 - 5,000 కోట్లు
ఉత్తరాంధ్రలో తొలి గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం



**శ్రీ కొలుసు పార్థసారథి.**
**రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల మరియు హౌసింగ్ శాఖ మంత్రి,**
**ఆంధ్ర ప్రదేశ్**

**ఉత్తర్యాంధ్రకు స్వర్ణయుగం!** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం విమానాల రాకపోకల కేంద్రం కాదు. ఇది ఉత్తరాంధ్రను ప్రపంచంతో అనుసంధానించే గగనద్వారం. పెట్టుబడులకు ఆహ్వానం, పారిశ్రామికీకరణకు పునాది, పర్యాటక రంగానికి కొత్త శక్తి, యువతకు ఉపాధి వేదిక. రాబోయే కాలంలో ఉత్తరాంధ్ర ఆర్థిక రూపురేఖలను సమూలంగా మార్చివేయనున్న ఈ బృహత్ ప్రాజెక్టు... రాష్ట్ర ప్రభుత్వ ఆశయమైన 'స్వర్ణాంధ్ర' నిర్మాణంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు!

## గ్రామ మాజీ సర్పంచ్ మార్తి రాములు మృతి పట్ల నివాళులర్పించిన తన్నీరు నాగేశ్వరరావు



**జగ్గయ్యపేట, జూలై 27 (వార్తప్రభ)** జగ్గయ్యపేట నియోజకవర్గం జగ్గయ్యపేట మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ మార్తి రాములు ఆకస్మిక మరణవార్త తెలుసుకున్న జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు స్థానిక పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు రాములు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## 31న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'సృజనోత్సవం' సాహిత్య సాంస్కృతిక సందడి



**విజయవాడ పశ్చిమ జులై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐ.వి.ఎఫ్) సౌజన్యంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహణలో 'సృజనోత్సవం' సాహిత్య సాంస్కృతిక సందడి కార్యక్రమం జులై 31న శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరగనుంది. ఈ కార్యక్రమ కరపత్రాన్ని మంగళవారం ప్రసిద్ధ మానసిక వైద్య నిపుణులు, రచయిత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి సూర్యారావుపేటలోని ఆయన హాస్పిటల్ లో నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, మినీ స్కిట్స్, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, గజల్ గానం, సత్కారాలు, ఐ.వి.ఎఫ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతాయి. ఈ కార్యక్రమానికి సుప్రసిద్ధ సాహితీవేత్తలు, మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్, ఐ.వి.ఎఫ్. ఏపీ జనరల్ సెక్రెటరీ గొంట్ల మోహన్రావు, అధ్యక్షులు కొల్లూరు లక్ష్మణగుప్తా తదితరులు హాజరవుతారు. ఉదయం 10 గంటలకు 'కళాక్షేత్ర ది డాన్స్ అకాడమీ' నిర్వాహకులు ఎ. గీత, పి. మౌనిక శిష్యబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం ఐ.వి.ఎఫ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరుగుతుంది. భోజనం అనంతరం కవి సమ్మేళనం, డాక్టర్ కె. జి. వేణు అధ్యయనకర్తగా వెలువరించిన 'అంతరంగ వీక్షణం-అనుశీలన' పుస్తకావిష్కరణ, మినీ స్కిట్స్, గజల్ గానం, సత్కారాలు జరుగుతాయని మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ తెలిపారు. కరపత్రం ఆవిష్కరించిన డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ- కవుల్ని, కళాకారుల్ని ప్రోత్సహించే 'సృజనోత్సవం' వంటి సాహిత్య, సాంస్కృతిక సందళ్ళు ఎక్కువగా జరగాల్సిన అవసరం వుందన్నారు. సమాజాన్ని జాగృతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫొటో జర్నలిస్టు శ్రీ వై. డి. ఆనంద్, సీనియర్ జర్నలిస్టు చొప్పా రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనాలనుకునే కవులు 83329 03156 నెంబరులో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

## మహారాష్ట్ర లాతూర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధుల విజ్ఞాన యాత్ర

**- డా. బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం, కళావేదికను సందర్శించిన మేయర్, కార్పొరేటర్లు**
**- ప్రాజెక్టు నిర్మాణ విశిష్టతను వివరించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**విజయవాడ పశ్చిమ జులై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహారాష్ట్ర రాష్ట్రంలోని లాతూర్ సిటీ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన గౌరవ మేయర్ బాలచంద్ర కంబుల్, కార్పొరేటర్లు, అధికారుల బృందం మంగళవారం విజయవాడలోని డా. బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం, అంబేద్కర్ కళావేదికను విజ్ఞాన యాత్రలో భాగంగా సందర్శించింది. ఈ సందర్భంగా బందర్ రోడ్--ఎంజీ రోడ్ కూడలిలోని డా. బీఆర్ అంబేద్కర్ స్మృతి వనంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 210 అడుగుల విగ్రహాన్ని సందర్శించిన ప్రతినిధి బృందం, అక్కడి అత్యాధునిక సౌకర్యాలను పరిశీలించింది. ఎక్స్‌పీరియన్స్ థియేటర్, సుందరమైన గ్రీనరీ, బ్యూటిఫికేషన్, ఫౌంటెన్లు, డాక్టర్ అంబేద్కర్ జీవిత విశేషాలను ప్రతిబింబించే మ్యూరల్ ఆర్ట్స్, సెమినార్ హాల్, డిజిటల్ ప్రదర్శనలు, ఆయన జీవిత చరిత్రను వివరిస్తున్న ప్రత్యేక ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు. విగ్రహ నిర్మాణంలో వినియోగించిన సాంకేతికతకు సంబంధించిన వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబేద్కర్ కళావేదికను సందర్శించిన బృందం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ఆధునిక సదుపాయాలు, కళా ప్రదర్శనలు, నిర్మాణ వైశిష్ట్యాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అంబేద్కర్ స్మృతి వనం, కళావేదిక నిర్మాణ విశిష్టత, సాంకేతిక అంశాలు, ప్రజలకు అందిస్తున్న సాంస్కృతిక, విద్యా ప్రయోజనాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, విజయవాడ నగరం ఆధునిక అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. దేశంలోని అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అంబేద్కర్ స్మృతి వనాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. అలాగే ఇటీవల నిర్మించిన అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, చరిత్ర, కళాత్మక వైభవాన్ని ప్రతిబింబించే విశిష్ట ప్రదర్శనలు ఏర్పాటు చేశామని వివరించారు. కలెక్టర్ ప్రజెంటేషన్ అనంతరం లాతూర్ సిటీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బాలచంద్ర కంబుల్ మాట్లాడుతూ, తమకు విజయవాడలో లభించిన ఆతిథ్యం అమూల్యమైనదని పేర్కొన్నారు. అంబేద్కర్ స్మృతి వనం, అంబేద్కర్ కళావేదిక అత్యంత సాంకేతిక ప్రమాణాలతో అభివృద్ధి చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. భవిష్యత్తులో లాతూర్‌లో అంబేద్కర్ విగ్రహ నిర్మాణం చేపట్టే సమయంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశను ప్రత్యేకంగా ఆహ్వానించి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.. లాతూర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, కార్పొరేటర్ల బృందానికి అంబేద్కర్ విగ్రహ ప్రతిరూపాన్ని జ్ఞాపికగా అందజేశారు. మరో జ్ఞాపికను లాతూర్ మున్సిపల్ కమిషనర్‌కు అందజేయాలని బృందానికి అందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎ.రవీంద్రరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఎస్టేట్ ఆఫీసర్ ఎస్.శ్రీధర్, ఇన్‌చార్జి జిల్లా అగ్నిమాపక అధికారి నరేష్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె బాబ్జి, డి జడ్ యం జి.జ్యోతి, డి జడ్ యం ఎలక్ట్రికల్ యం. దొరబాబు, మేనేజర్ టెక్నికల్ ఇస్మాయిల్ బేజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ రహీం, కల్చరల్ డిపార్ట్మెంట్ మేనేజర్ యం సుమన్, కేపీసీ డైరెక్టర్ వాసు, శిల్పి ప్రసాద్, లాతూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ విజయ్‌కుమార్, స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యం - వీఎంసీ

**నగరంలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలపై ఆకస్మిక తనిఖీలు**





**విజయవాడ పశ్చిమ జులై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ రీజినల్ ఫైర్ ఆఫీసర్ రత్నబాబు ఆధ్వర్యంలో నగరంలోని షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలు, కార్యాలయ భవనాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, హోటళ్లు మరియు ప్రజలు అధికంగా సందర్శించే ఇతర భవనాల్లో ఆకస్మిక అగ్నిమాపక భద్రతా తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం ఎం.జి రోడ్లో గల చెన్నై షాపింగ్ మాల్ లో వియంసి ఫైర్ సిబ్బంది ఆకస్మికతనికి నిర్వహించారు. తనిఖీల సందర్భంగా భవనాల్లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక పరికరాలు, ఫైర్ అలారం వ్యవస్థలు, స్మోక్ డిటెక్టర్లు, స్ప్రింక్లర్ వ్యవస్థలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఎగ్జిట్ సూచిక బోర్డులు, విద్యుత్ భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయా లేదా అనే విషయాన్ని కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రీజినల్ ఫైర్ ఆఫీసర్ రత్నబాబు మాట్లాడుతూ, ప్రజల రక్షణ దృష్ట్యా ప్రతి భవన యాజమాన్యం అగ్నిమాపక భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలను ఎల్లప్పుడూ వినియోగానికి సిద్ధంగా ఉంచడంతో పాటు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వహించాలని తెలిపారు. అలాగే ఫైర్ సేఫ్టీ పరికరాల నిర్వహణను కాలానుగుణంగా చేపట్టి, సిబ్బందికి అగ్నిమాపక భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. తనిఖీలలో గుర్తించిన లోపాలను సంబంధిత యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్లి, తక్షణమే సరిదిద్దాలని ఆదేశించినట్లు తెలిపారు. భద్రతా నిబంధనలను పాటించని యాజమాన్యాలపై అమలులో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకుని నగరవ్యాప్తంగా అగ్నిమాపక భద్రతా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రతి సంస్థ అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని రీజినల్ ఫైర్ ఆఫీసర్ రత్నబాబు కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వీఎంసీ ఫైర్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 38 వ ,డివిజన్ లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం



**విజయవాడ పశ్చిమ జులై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 38 వ,డివిజన్ లో మంగళవారం ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్ బుద్దా వెంకన్న సూచనల మేరకు 38 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సురభి బాలు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక 38 వ డివిజన్ కుమ్మరిపాలెం సెంటర్ 52 వ బూత్ నందు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ పరిశీలకులు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్ రావు పాల్గొని కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి వారి వద్ద నుంచి సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ నందం భవానీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి ఈశ్వర్ రావు, యూనిట్ ఇంచార్జ్ మారోజు మోహన్, కంభంపాటి దుర్గారావు, బూత్ కన్వీనర్లు దొడ్డి సత్తిబాబు, చింతపల్లి సత్యనారాయణ, షేక్ యూసుబ్, విజయలక్ష్మి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ లో ఘనంగా స్కౌట్ అండ్ గైడ్ మెడల్స్ అందజేత



**మద్రిపాడు జులై 28 (వార్తాప్రభ)** నందవరం మోడల్ స్కూల్ లో స్కౌట్ అండ్ గైడ్ అధికారిక బాధ్యతల స్వీకార వేడుక కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులకు ప్రవేశ్ సర్టిఫికెట్లు మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోలూరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ సేవాభావం నాయకత్వ లక్షణాలు దేశభక్తి సమాజ సేవ పట్ల బాధ్యతను పెంపొందించడంలో స్కౌట్ అండ్ గైడ్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నెల్సన్ కిషోర్ స్కౌట్ మాస్టర్ రఘు క్రాంతి కుమార్ గైడ్ కెప్టెన్ ప్రసన్నకుమారి అధ్యాపకులు శివకుమార్ రవికుమార్ ఇతర ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ కు అనూహ్య స్పందన.

**కూటమి నేతలతో కలిసి వినతులు స్వీకరించిన కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్.**



**విజయవాడ పశ్చిమ జులై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం,ఎన్డీయే కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ లకు ప్రజలనుంచి అనూహ్య స్పందన లభిస్తోంది..కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , మాజీ కార్పొరేటర్లు మరుపిళ్ళ రాజేష్ , అత్తులూరి ఆదిలక్ష్మీ పెదబాబు, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ నున్న కృష్ణ, బీజేపీ నాయకులు పోతిన భేసు కంటేశ్వరుడు తదితరులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.. పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వారి సమస్యలను తెలిపారు.ప్రభుత్వ పథకాలు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, వైద్య సహాయం , స్థానిక సమస్యలపై ప్రజలు ప్రత్యేకంగా దరఖాస్తులు అందజేశారు..వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే సుజనా చౌదరి చర్యలు తీసుకుంటున్నారని మాజీ కార్పొరేటర్లు మరుపిళ్ళ రాజేష్, అత్తులూరి ఆదిలక్ష్మీ పెదబాబు, బీజేపీ నాయకులు పోతిన భేసు కంటేశ్వరుడు తెలిపారు .కూటమి నేతలు దేవిన హరి ప్రసాద్, ఈగల సాంబశివరావు, గడ్డం సాంబశివరావు, ప్రభు చరణ్, దాడి మురళి కృష్ణ తదితరులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు...

## ప్రజా సమస్యల పరిష్కరించలేని పాలకులకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు

**నగర సీపీఐ కార్యదర్శి జి కోటేశ్వరరావు**



**విజయవాడ పశ్చిమ జులై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యలు పట్టని పాలకులకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని సిపిఐ నగర్ కార్యదర్శి జి.కోటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక 49వ డివిజన్ జనరల్ బాడీ సమావేశం డివిజన్ నాయకులూ చేపూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ నగర్ కార్యదర్శి కోటేశ్వరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నేతృత్వం లోని ఎన్డీయే ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలో టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గాని ప్రజా సమస్యల పట్ల అలసత్వం ప్రదర్శితుండటంతో అన్ని వర్గాల ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి నెలకొని ఉందని అన్నారు. రోజురోజుకి పెరుగుతున్న నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజల జీవితం దుర్భరంగా మారిందని, ఇది ఏమి పట్టనట్టు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణకు ఎటువంటి ప్రయత్నాలు చేయకుండా బ్లాక్ మార్కెట్ ను ప్రోత్సహిస్తూ సామాన్యుడు జీవించే హక్కును సైతం కాలరాసున్నారని ఆగ్రహం వ్యకతం చేసారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తాము అని చెప్పి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడచినా తరువాత కూడా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని, అలాగే రాష్ట్రంలోని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో మేము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తాము, లేదంటే ప్రతి నిరుద్యోగికి నెలకు 3 వేల నిరుద్యోగ భృతి కల్పిస్తామన్న హామీ ఏమైందని ప్రశించారు. రాష్ట్రంలో పేదవాడు అనారోగ్యం వస్తే జీవించే హక్కు లేదు అన్న చందంగా ఆరోగ్యశ్రీ ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ, ఆరోగ్యశ్రీ బిల్లులను సకాలంలో చెల్లించకుండా ప్రజలకు సరైన అందని ద్రాక్షగా మార్చారని అన్నారు. ఇదే సందర్భంలో ప్రభుత్వం ప్రభుత్వరంగ వైద్య వ్యవస్థని బలోపేతం చేయకూడని గత ప్రభుత్వం ప్రారంభించదలచిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను దానికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులను మేము నడపలేము అంటూ ప్రవేటువారికి అప్పుచెప్పడం వారి చేతకానితనానికి నిదర్శనంగా చెపొచ్చు అని ఎద్దేవా చేసారు. కేంద్ర ప్రభుత్వం కాషాయీకరణ చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేటీకరణ చేస్తూ సామాన్యులకు వైద్యం అందకుండా చేస్తునారు అని అన్నారు. ప్రభుత్వాలు ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నిలకల్లో పాలక పక్షాలకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారనుని హెచ్చరించారు.నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడయ్య మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి సిపిఐ పక్షాన అనేక పోరాటాలు నిర్వహిస్తున్న పాలకుల స్పందన అంతంత మాత్రంగానే ఉందని. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారం ఉన్న లేకున్నా ఎల్లపుడు ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారమునకు ఎల్లపుడు సిద్ధంగా ఉండేది కేవలం కమ్యూనిస్టులే అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానలకు వ్యతిరేకంగా సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా "మార్పు రావాలి" అనే నినాదంతో ఆగష్టు 6వ తేదీ నుండి 15వ తేదీ వరకు నగర వ్యాప్తంగా అన్ని డివిజన్ల లో ప్రజా చైతన్య పాదయాత్రలు జరుగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఈ పాదయాత్రలు జయప్రదం చేసేందుకు కృషి చేయాలనీ విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి బోరా రామకృష్ణ, 50వ డివిజన్ కార్యదర్శి మోకా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## మాతృమూర్తి సందేశం



ఇరుగుపొరుగు వారితో
పెట్టుకోకు ఏ గొడవలు
అహంకార మనసుతో
తెచ్చుకోకు ఇబ్బందులు
హద్దులేని కోపంతో
ఊబిలాంటి వ్యసనంతో
నిన్ను నీవు చెరుపుకోకు
కుటుంబాన్ని వేధించకు
ముప్పు తెచ్చు అప్పులతో
అంతులేని తప్పులతో
నాశనమే కాబోకు
దుర్జనుల స్నేహంతో
ముందుచూపు ఉండాలి
కష్టించి జీవించాలి
ఆత్మగౌరవం పెంచుకుని
తిరగాలి తలెత్తుకుని

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# యువత సాధికారతకు గుర్తింపు.. అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌కు జాతీయ అవార్డు

**తిరుపతి, జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంలో విశిష్ట సేవలు అందిస్తున్న అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ (ూా=ాణజ) ప్రతిష్ఠాత్మక 'సోషల్ ఇంపాక్ట్ ఎక్సలెన్స్ అవార్డు--2026'ను అందుకుంది. అమర రాజా సంస్థ మద్దతుతో రాజన్న ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ కేంద్రానికి హైదరాబాద్‌లోని ది అడ్రస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్స్, నర్సింగిలో జరిగిన పీఎంఐ పర్ల్ సిటీ హైదరాబాద్ చాప్టర్ వార్షిక అవార్డ్స్--2026 కార్యక్రమంలో ఈ గౌరవం లభించింది.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలను అందించడం, ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా సమాజంపై సానుకూల ప్రభావం చూపుతున్నందుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు, ప్రస్తుతం అంతర్జాతీయ ద్రవ్య నిధి (×వీఖీ) కార్యనిర్వాహక డైరెక్టర్ కృష్ణమూర్తి వి. సుబ్రహ్మణ్య సమక్షంలో అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ డీన్ రవికుమార్, రాజన్న ఫౌండేషన్ మేనేజర్ బాలసుబ్రమణ్యం ఈ పురస్కారాన్ని




అందుకున్నారు.ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ, సమాజాభివృద్ధి పట్ల తమ సంస్థ నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనమని పేర్కొన్నారు. నాణ్యమైన నైపుణ్య శిక్షణ ద్వారా యువత జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యమని, ఈ గుర్తింపు మరింత ఉత్సాహంతో సేవలను విస్తరించేందుకు ప్రేరణనిస్తుందని తెలిపారు.అమర రాజా గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షులు, రాజన్న ఫౌండేషన్ చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, సమాజానికి తిరిగి ఇవ్వాలనే విలువలతోనే సంస్థ ముందుకు సాగుతోందన్నారు. యువతకు నైపుణ్యాలు అందించడం ద్వారా కుటుంబాలు, సమాజం, దేశ అభివృద్ధికి తోడ్పడుతున్నామని చెప్పారు.ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వం, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వేలాది మంది యువతను ఉద్యోగాలు, స్వయం ఉపాధి వైపు తీర్చిదిద్దుతున్న అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌కు ఈ అవార్డు మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపుగా నిలిచిందని రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్ తెలిపారు.

## నారాయణ పాఠశాలలో వైభవంగా 'విద్యార్థి మంత్రిమండలి' ప్రమాణ స్వీకారోత్సవం"



**గన్నవరం, జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గన్నవరం విద్యనగర్ లోనినారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో ఈరోజు "విద్యార్థి నాయకత్వ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ షేక్ మస్తాన్ భాషా , మరియు ముఖ్య అతిథిగా గన్నవరం .ఎస్ ఐ శ్రీధర్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం పాఠశాల స్థాయి ఎన్నికలలో ఎంపికైన ప్రజాస్వామ్యబద్ధ విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు తొడిగి నాయకత్వ బాధ్యతలను అప్పగించారు.

**ఎంపికైన విద్యార్థి నాయకులు:** స్కూల్ హెడ్ బాయ్ : పార్థవకృష్ణ (ix క్లాస్) స్కూల్ హెడ్ గర్ల్ ఏం అక్షయ (ix క్లాస్), డిప్యూటీ హెడ్ బాయ్ ఆర్యన్ (viii క్లాస్), డిప్యూటీ హెడ్ గర్ల్: సాహిత్య(viii క్లాస్),.యతీ. హెడ్ బాయ్. ధృవ (ఎ క్లాస్), యతీ. హెడ్ గర్ల్ :దుర్గా శరణ్య(ఎ క్లాస్) ప్రతినిధులచే ప్రిన్సిపల్ క్రమశిక్షణ, నిబద్ధత మరియు పాఠశాల నియమావళికి కట్టుబడి ఉంటామని ప్రమాణం చేయించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మస్తాన్ భాషా మాట్లాడుతూ – "నారాయణ సంస్థలు కేవలం విద్యాభ్యాసానికే కాకుండా, విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించడానికి విశేషంగా కృషి చేస్తాయి. ఈ క్యాబినెట్ నిర్వహణ ద్వారా విద్యార్థులలో నిర్ణయాత్మక శక్తి, జట్టుగా పనిచేసే తత్వం పెరుగుతాయి" అని వ్యాఖ్యానించారు.అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు, కవాతు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా పాఠశాల ఏ జీ ఎం సత్తిరెడ్డి ,జోనల్ కో ఆర్డినేటర్ కిరణ్ బాబు , అకాడమిక్ డీన్ నవీన , ఈబి చాంప్స్ జోనల్ కో ఆర్డినేటర్ లియోనీ , సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ సాగర్ మరియు ప్రవీణ్ , ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విద్యార్థి క్యాబినెట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## పొగాకు రాష్ట్ర సంక్షేమ సంఘం పిలుపు

**జూలై నెల 29 న జరుగు జాతీయ రహదారుల దిగ్బంధం ను జయప్రదం చేయండి**



**మద్రిపాడు జూలై 28 (వార్తాప్రభ)** మద్రిపాడు మండలండీసీపల్లి పొగాకు వేలం కేంద్రం వద్ద డీసీపల్లి పొగాకు రైతు సంక్షేమ సంఘం మరియు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పొగాకు పంటకు మద్దతు ధర కోసం చేస్తున్న రిలేదీక్షలు 5వ రోజు ప్రారంభమయ్యాయి.ఈ రిలే నిరాహార దీక్షలు పొగాకు ధరలు పెరిగే వరకు కొనసాగుతాయి.ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి మరియి డీసీపల్లి పొగాకు బోర్డు సంక్షేమ సంఘం అధ్యక్షులు మూలి వెంగయ్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర నారాయణ స్వామి రైతు సంఘం మండల నాయకులు ఉల్లగంటి శ్రీను వాసులు రెడ్డి గంగినేని నారాయణ లు ప్రసంగించారు సుధాకర్ వీరయ్య నారయ్య తదితర రైతు నాయకులు డీసీ పల్లి కోనసముద్రం వెన్నవాడ నారంపేట బి.చిరువెళ్ల అల్లిపురం కరటంపాడు నల్లరాజుపాలెం రావులకొల్లు క్లస్టర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గన్నవరం, జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం.. గన్నవరం సెక్షన్ పరిధిలో లైన్ మెయింటినెన్స్ వర్క్ మరియు న్యూ లైన్ ఏరెక్షన్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును.. రేపు అనగా బుధవారం (29-07-26) ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 02:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సీపీడీసీఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ డి.విశ్వేశ్వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు కేసరపల్లి మొత్తం ఏరియా, ఎస్ ఎల్ విల్లాస్, జక్కుల నక్కలం హౌసింగ్ కాలనీ, ఉప్పులూరు రోడ్డు, అప్పారావుపేట, బుద్ధవరం, అర్జైంపూడి, బూతుమిల్లిపాడు,ఆ ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును కావున గృహ వినియోదారులు, వ్యవసాయ వినియోగదారులు,వ్యాపార వినియోగ దారులు,పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.వ్యవసాయ కరెంటు ఉదయం 5:00 నుంచి 9:00 వరకు మరియు మధ్యాహ్నం 02:00 నుంచి సాయంత్రం 6:00 వరకు ఉంటుంది గమనించగలరు.

## సైఫన్ మరమ్మతుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

**అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి ఆగ్రహం**

**రూ.27 లక్షలతో పునరుద్ధరణ..రెండు,మూడు రోజుల్లో నీటి సరఫరా పునరుద్ధరిస్తామని వెల్లడి**



**సంగం జూలై 28 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం మద్రిపాడు సమీపంలోని బెజవాడ పాపిరెడ్డి కాలువపై దెబ్బతిన్న సైఫన్ ఆక్విడెక్ట్‌ను కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు.అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనులను క్షుణ్ణంగా తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని కావలి కాలువ అధికారులను ఆదేశించారు.కాంక్రీట్ పనుల్లో నాణ్యత లోపించడంపై అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కావలి కాలువ 12వ కిలోమీటర్ వద్ద ఉన్న సైఫన్ దాదాపు 25 రోజులుగా దెబ్బతిని విలువైన సాగునీరు సముద్రంలో వృథాగా కలుస్తోందన్నారు.ఇంత పెద్ద సమస్య నెలకొన్నప్పటికీ జిల్లా కలెక్టర్‌కు ప్రజాప్రతినిధులకు లేదా తన దృష్టికి తీసుకురావడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.సమస్య తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సైఫన్ పునరుద్ధరణ పనుల కోసం రూ.27 లక్షల నిధులు మంజూరు చేయించామని తెలిపారు.సైఫన్ దెబ్బతినడంతో కాలువ కింద ఉన్న సుమారు లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పాటు తాగునీటి అవసరాలపై కూడా తీవ్ర ప్రభావం పడిందన్నారు. స్థానిక రైతుల సహకారంతో మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టామని రాబోయే రెండు నుంచి మూడు రోజుల్లో పనులు పూర్తిచేసి కాలువ ద్వారా మళ్లీ సాగునీరు తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.అంతవరకు కాలువ కింద ఉన్న రైతులందరూ పరస్పర సహకారంతో వ్యవహరించాలని అవసరానికి మించి నీటిని నిల్వ చేసుకోకుండా ఆరుతడుల పద్ధతిలో వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

## పెనుగంచిప్రోలు మున్నేరు ఇసుక తిన్నెల్లో.....

**గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ' గుర్తుతెలియని వ్యక్తులు చేస్తున్న వేట**





**పెనుగంచిప్రోలు, జులై 28( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మున్నేరు ఇసుకలో వింత అన్వేషణ.. గుట్టుచప్పుడు కాకుండా లోహాలు, సూక్ష్మ బంగారం వెలికితీత ! ఎన్టీఆర్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న మున్నేరు నది ఒడ్డున గత రెండు నెలలుగా ఒక వింత వ్యవహారం సాగుతోంది. స్థానిక శివాలయ సమీపంలోని ఇసుక తిన్నెల్లో గుర్తుతెలియని కొందరు వ్యక్తులు మట్టిని తవ్వుతూ పక్కనే ప్రవహిస్తున్న నీటి సెలయేర్లలో జల్లెడ పడుతున్నారు. అందులో నుంచి వస్తున్న విలువైన లోహాలు,సూక్ష్మ బంగారు రేణువులను రహస్యంగా సేకరిస్తున్నారు.

**ఎవరు వీరు? ఏం చేస్తున్నారు?**ఆరా తీయగా.. వీరు వేరే రాష్ట్రానికి చెందిన వారని, ఎక్కడి నుంచో వలస వచ్చిన వీరు మున్నేరు నది పరివాహక ప్రాంతంలో తాత్కాలిక గుడారాలు వేసుకుని నివసిస్తున్నారు.అసలు వీరు ఈ ఇసుకను ఎందుకు తవ్వుతున్నారు? అ సలు వాళ్లకు ఏం లభిస్తున్నాయి, ఒకవేళ ఏమి లభించకపోతే ఇంతకాలం నుంచి సొంత ఖర్చులతో ఎందుకు సహజీవనం చేస్తున్నారు అనేది స్థానికులకు అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోతుంది.....

**ఇక్కడేనా, ఇంకెక్కడైనా ఇలా చేస్తున్నారా?**ఇలాంటి వినూత్న వేట కేవలం ఇక్కడే కాదు,నదీ పరివాహక ప్రాంతాలు, అలాగే పురాతన దేవాలయాలు ఎక్కువగా ఉండే పట్టణాలలో కూడా బంగారం వెలికితీస్తూ ఉండొచ్చు అని స్థానికులు మాట్లాడుకుంటున్నారు,

**అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?** సుమారు రెండు నెలల నుంచి నది ఒడ్డున ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**భద్రతా పరమైన ఆందోళనలు:** గుర్తుతెలియని వ్యక్తులు నదీ తీరంలో గుడారాలు వేసుకుని ఉంటున్నా,వారు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? అనే వివరాలను స్థానిక రెవెన్యూ లేదా పోలీస్ అధికారులు పట్టించుకోపోవటం గమనార్హం...

**చారిత్రక ప్రాధాన్యత:**మున్నేరు నది ఒడ్డున గతంలో ఎన్నో పురాతన ఆలయాల ఆనవాళ్లు ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. ఒకవేళ ఇసుక తవ్వకాల్లో చారిత్రక సంపద లేదా పురాతన వస్తువులు భారీస్థాయిలో దొరికి అవి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళితే.అప్పుడు మరి ప్రభుత్వ అధికారులు ఏం చేస్తారు.... నదీ పరివాహక ప్రాంతాల్లోని పర్యావరణానికి భంగం కలగకుండా,అసలు అక్కడ ఏం జరుగుతుందోతెలుసుకోవడానికి మైనింగ్,రెవెన్యూ, పోలీస్ అధికారులు వెంటనే స్పందించి మున్నేరు తీరంలో తనిఖీలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు...

## భారత బొమ్మల పరిశ్రమకు కేంద్రం భారీ ఊతం.!

**దిగుమతులకు అడ్డుకట్ట... ఎగుమతులకు రెక్కలు.!**

**ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్నకు కేంద్రం సమగ్ర వివరణ -- నేషనల్ యాక్షన్ ప్లాన్‌తో టాయ్స్ రంగానికి కొత్త దిశ.**



**మచిలీపట్నం జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారత బొమ్మల (టాయ్స్) పరిశ్రమను ప్రపంచ స్థాయిలో పోటీతత్వం కలిగిన రంగంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమ శాఖ వెల్లడించింది. దిగుమతులను తగ్గించి, దేశీయ తయారీని ప్రోత్సహిస్తూ, ఎగుమతులను గణనీయంగా పెంచే దిశగా సమగ్ర కార్యాచరణ కొనసాగుతోందని తెలిపింది. ఈ విషయాలను మచిలీపట్నం లోక్‌సభ సభ్యుడు వల్లభనేని బాలశౌరి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య ఉ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ లిఖితపూర్వక సమాధానంలో వివరించారు.

**దేశీయ తయారీకి కేంద్రం ప్రాధాన్యం:**ప్రస్తుతం దేశంలో ప్రత్యేక టాయ్ పాలసీ అమల్లో లేకపోయినా, బొమ్మల పరిశ్రమ అభివృద్ధి కోసం నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ టాయ్స్ (ఎన్ ఎ పి టి) ను అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 14 మంత్రిత్వ శాఖల సమన్వయంతో 21 కీలక కార్యాచరణ అంశాలను అమలు చేస్తూ తయారీ, నాణ్యత, మార్కెటింగ్, ఎగుమతుల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించింది.

**భారత్ మండపంలో అంతర్జాతీయ టాయ్ ఎగ్జిబిషన్:**ఈ ఏడాది జూలై 4 నుంచి 7 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన 17వ టాయ్ బిజ్ ఇంటర్నేషనల్ దీ2దీ ఎగ్జిబిషన్ భారత టాయ్స్ పరిశ్రమకు కొత్త అవకాశాలను తెరిచిందని కేంద్రం పేర్కొంది. ఈ ప్రదర్శనలో 400 భారతీయ టాయ్ బ్రాండ్లు, 40 దేశాల నుంచి 100 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు, సుమారు 30 వేల మంది వ్యాపార సందర్శకులు పాల్గొన్నారు. తయారీదారులు, హోల్‌సేలర్లు, రిటైలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఈ-కామర్స్ సంస్థల మధ్య వ్యాపార భాగస్వామ్యాలు పెరగడానికి ఈ వేదిక దోహదపడిందని వివరించింది.

**దిగుమతుల నియంత్రణ... ఎగుమతుల విస్తరణ:**దేశీయ పరిశ్రమను రక్షించేందుకు బొమ్మలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని 20 శాతం నుంచి 70 శాతానికి పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది. అలాగే నాణ్యత నియంత్రణ ఉత్తర్వులు (క్యూ సి ఓ) అమలు చేయడం, బి ఐ ఎస్ ప్రమాణాలను తప్పనిసరి చేయడం ద్వారా నాసిరకం దిగుమతులకు అడ్డుకట్ట వేసినట్లు పేర్కొంది. ఇప్పటికే దేశీయ తయారీదారులకు 1,800కు పైగా BIS లైసెన్సులు జారీ చేసినట్లు వెల్లడించింది.

**స్టార్టప్‌లు, టాయ్ క్లస్టర్లకు చేయూత** టాయ్ క్లస్టర్ల అభివృద్ధితో పాటు స్టార్టప్ ఇండియా కార్యక్రమం కింద 700కు పైగా టాయ్ స్టార్టప్‌లకు గుర్తింపు కల్పించినట్లు కేంద్రం తెలిపింది. అదేవిధంగా ఆర్ ఓ డి టియి ఎప్ పథకం ద్వారా 2,200కు పైగా ఎగుమతిదారులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొంది. యూఏఈ, ఆస్ట్రేలియా, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈ ఎఫ్ టి ఏ), యూకేతో కుదిరిన వాణిజ్య ఒప్పందాల ద్వారా భారత బొమ్మలకు సుంక రహిత మార్కెట్ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించింది.

**నాణ్యతలో భారీ పెరుగుదల:**ఈ చర్యల ఫలితంగా భారత టాయ్స్ పరిశ్రమలో గణనీయమైన మార్పు చోటుచేసుకుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019లో బిఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న బొమ్మలు కేవలం 33 శాతం మాత్రమే ఉండగా, 2025 నాటికి ఈ సంఖ్య 95 శాతానికి చేరడం పరిశ్రమలో నాణ్యత పెరుగుదలకు నిదర్శనమని బాలశౌరి అన్నారు.

**నికర ఎగుమతిదారుగా భారత్:**2018--19తో పోలిస్తే 2025--26 నాటికి బొమ్మల దిగుమతులు 37.5 శాతం తగ్గగా, ఎగుమతులు 89.1 శాతం పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం భారతదేశం అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, నెదర్లాండ్స్, జర్మనీ తదితర దేశాలకు బొమ్మలను ఎగుమతి చేస్తూ ప్రపంచ మార్కెట్‌లో నికర ఎగుమతిదారుగా ఎదుగుతోందని పేర్కొంది. 'మేక్ ఇన్ ఇండియా', 'వోకల్ ఫర్ లోకల్' విధానాలకు ఈ రంగం విజయవంతమైన ఉదాహరణగా నిలుస్తోందని కేంద్రం స్పష్టం చేసిందని ఎంపీ బాలశౌరి తెలిపారు.

## జగ్గయ్యపేట లోని ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాల పంపిణీ



**జగ్గయ్యపేట జూలై 28 (వార్తప్రభ)**జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలు ఏర్పాటు చేయాలనే సదుద్దేశంతో అమర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్రపటాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అమర్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీరామ్ సింగ్ మరియు బిజెపి నాయకులు జగ్గయ్యపేట ఎమ్మార్వో కార్యాలయం, సీఐ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ సింగ్ మాట్లాడుతూ, భారతదేశ అభివృద్ధి, సుపరిపాలన, ప్రజా సంక్షేమం, జాతీయ సమైక్యత కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న నాయకత్వం దేశానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు విచ్చేసే ప్రజలకు దేశ నాయకత్వం, జాతీయ విలువలు గుర్తుండేలా ఈ చిత్రపటాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అమర్ సేవా ఫౌండేషన్ రాజకీయాలకు అతీతంగా సమాజ సేవ, జాతీయ చైతన్యం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో ప్రజలకు సేవలందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, బిజెపి పట్టణ అధ్యక్షుడు యంపోగు రాజా, యన్ టి ఆర్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మన్నె మాధవి, పట్టణ ప్రధాన కార్యదర్శులు వల్లపునేని కంభాల గోపి, పట్టణ యువ మోర్చా అధ్యక్షుడు తోట గోపి, పట్టణ ఆర్.టి.ఐ. సెల్ కన్వీనర్ నాగేంద్ర కుమార్, జె టివి అధినేత కరిసె మధు, సిద్దు ఫోటో స్టూడియో యజమాని సిద్దు, నరేంద్ర, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు మరియు పలువురు సామాజిక సేవకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆయుర్వేద సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి -డాక్టర్ వాణి.




**పెనుగంచిప్రోలు, జూ లై 28( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం లోని కొనకంచి గ్రామం నందు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వాణి తెలిపారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని సూచించారు.ప్రభుత్వ ఆయుర్వేద సేవలపై ప్రజల్లో అవగాహన పెంచుకోవాలని ఆమె కోరారు.

## పుట్టినరోజు సందర్బంగా విద్యార్ధుల కు బుక్స్ జామెంట్రీ బాక్సులు పెన్నులు పంపిణి



**జగ్గయ్యపేట జులై 28 (వార్తప్రభ)** వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ నందనవనం మాజీ ప్రెసిడెంట్ చిన్నం సీతారామకృష్ణ ప్రసాద్ కుమారుడు మణిదీప్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో పూజలు చేసి, ప్రభుత్వం పాఠశాల లో 100 మంది విద్యార్థుల కు బుక్స్, జామెంట్రీ బాక్సులు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు, పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చిట్టిబాబు, ఐ వి ఎఫ్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా గౌరవ సలహాదారులు మరియు పట్టణ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాసరావు, ఐ వి ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి పెనుగొండ రామకృష్ణ, పట్టణ సెక్రెటరీ రాయపూడి రమేష్, పట్టణ గౌరవ అధ్యక్షులు గెల్లా నాగేశ్వరరావు, పొలిటికల్ కమిటీ సభ్యులు గెల్లా పూర్ణ చంద్రరావు, వాసవి క్లబ్స్ గౌరవ సలహాదారులు, కొత్త పురుషోత్తం, జగ్గయ్యపేట పట్టణ ట్రెజరర్ కర్లపాటి కొండ, అదనపు కోశాధికారి కురివెళ్ల వాసుదేవరావు,ఇవిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మరియు జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షురాలు వీరవల్లి పద్మా శ్రీనివాస్, పట్టణ కోశాధికారి వీరవల్లి ప్రమీలాకుమారి , స్కూల్ మాస్టర్స్, స్కూల్ టీచర్స్,తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో విశ్రాంత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మృతి



**మద్రిపాడు జులై 28 (వార్తాప్రభ)** మద్రిపాడు చుంచులూరు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో దాదాపు 30 సంవత్సరాలకు పైగా సేవలందించిన పడమటి నాయుడుపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ చీర్ల రామకృష్ణారెడ్డి సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు.ఆరు నెలల క్రితం అమెరికాలో నివసిస్తున్న తన కుమార్తె వద్దకు వెళ్లిన రామకృష్ణారెడ్డి తిరుగు ప్రయాణంలో సోమవారం ఉదయం బెంగళూరులో విమానం దిగారు.అనంతరం చుంచులూరుకు తిరిగి వస్తూ తిరుపతిలో నివసిస్తున్న తన కుమారుడి ఇంటికి వెళ్లారు.అక్కడ అకస్మాత్తుగా అస్వస్థతకు గురై గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.రామ కృష్ణారెడ్డి మృతి విషయం తెలుసుకున్న బంధుమిత్రులు శ్రేయోభిలాషులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వారి మృతితో పడమటి నాయుడుపల్లి చుంచులూరు గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన ఆయన సేవలను పలువురు స్మరించుకున్నారు.ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు పలువురు సానుభూతి తెలియజేశారు.

## భారత్‌లోనే తొలిసారిగా లేజర్ ఆధారిత 'లైవ్' రోబోటిక్ ఎయిర్‌వే సర్జరీ ప్రదర్శన

**ఘనంగా ముగిసిన అంతర్జాతీయ లారింగాలజీ సమ్మిట్ 2026**
**హైదరాబాద్ స్టార్ హాస్పిటల్స్, ఎల్‌వీపీ ఇండియా సంయుక్త నిర్వహణలో ఏపీఎల్‌ఏ, ఎల్‌వీపీ వార్షిక సదస్సులు**




**హైదరాబాద్ జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి):** హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్స్, లారింగాలజీ ఢ వాయిస్ అసోసియేషన్ ఇండియా భాగస్వామ్యంతో నిర్వహించిన 6వ ఆసియా-పసిఫిక్ లారింగాలజీ అసోసియేషన్ కాన్ఫరెన్స్, 14వ ఎల్‌వీపీ ఇండియా వార్షిక సదస్సు విజయవంతంగా ముగిసాయి. మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమ్మిట్‌లో ప్రపంచ నలుమూలల నుండి ప్రముఖ ఎయిర్‌వే సర్జన్లు, లారింగాలజిస్టులు, వాయిస్, స్వాలింగ్ (మింగే సమస్యలు) నిపుణులు పాల్గొన్నారు. స్టార్ హాస్పిటల్స్ సీనియర్ ఈఎన్‌టీ, పీడియాట్రిక్ ఎయిర్‌వే సర్జన్ డాక్టర్ పి.వి.ఎల్.ఎన్. మూర్తి ఆర్గనైజింగ్ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఈ సదస్సు, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ వైద్య సాంకేతిక పరిజ్ఞానం, అనుభవాల మార్పిడికి వేదికగా నిలిచింది. చారిత్రాత్మక శస్త్రచికిత్స ఘనత: ఈ కాన్ఫరెన్స్‌లో భారత్‌లోనే తొలిసారిగా "లేజర్ టెక్నాలజీతో కూడిన రోబోటిక్ ఎయిర్‌వే సర్జరీ"ని ప్రత్యక్షంగా (లైవ్) ప్రదర్శించారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను స్టార్ హాస్పిటల్స్‌లో విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ పి.వి.ఎల్.ఎన్. మూర్తి సారథ్యంలో డాక్టర్ విపిన్ గోయల్, డాక్టర్ శాంతను పంజా, డాక్టర్ జి.వి. నాగార్జున రెడ్డిలతో కూడిన అనుభవజ్ఞులైన వైద్యుల బృందం ఈ శస్త్రచికిత్సను పూర్తి చేసింది. రోబోటిక్ ఖచ్చితత్వం, లేజర్ సాంకేతికతను సమర్థవంతంగా మిళితం చేసి నిర్వహించిన ఈ శస్త్రచికిత్సను సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులు, ప్రముఖ వైద్య నిపుణులు విశేషంగా ప్రశంసించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో లైవ్ సర్జికల్ డిమాన్‌స్ట్రేషన్లు, కీలక ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు, క్యాడవరిక్ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ఎయిర్‌వే పునర్నిర్మాణం, స్వర తంత్రుల సమస్యలు, మింగే లోపాలు, రోబోటిక్ ఢ లేజర్ అప్లికేషన్లపై లోతైన చర్చలు జరిగాయి. హైదరాబాద్‌లో ఆసియా-పసిఫిక్ లారింగాలజీ అసోసియేషన్ సదస్సును నిర్వహించడం భారత్‌కు గర్వకారణం. దేశంలోనే తొలిసారిగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా లేజర్ ఆధారిత రోబోటిక్ ఎయిర్‌వే శస్త్రచికిత్సను ప్రదర్శించడం, ఆధునిక వైద్య ఆవిష్కరణల పట్ల మాకున్న కట్టుబాటుకు నిదర్శనం. ఇది భవిష్యత్తు తరాల ఈఎన్‌టీ, ఎయిర్‌వే సర్జన్లకు ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ పి.వి.ఎల్.ఎన్. మూర్తి (ఆర్గనైజింగ్ ఛైర్మన్, సీనియర్ ఈఎన్‌టీ సర్జన్, స్టార్ హాస్పిటల్స్) అన్నారు.

**ఇనాం భూముల సమస్య పరిష్కరించాలని ముఖ్యమంత్రికి**

## వినతిపత్రం అందజేసిన నెట్టెం రఘురామ్



**జగ్గయ్యపేట జులై 28 (వార్తప్రభ)** అమరావతి, జూలై ఇనాం భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ, దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ఇనాం భూముల సమస్యను మానవీయ దృక్పథంతో పరిశీలించి, రైతులకు, భూముల యజమానులకు శాశ్వత న్యాయం చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.తెలుగుదేశం పార్టీ గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్య పరిష్కారానికి ఆర్డినెన్స్ ద్వారా రాష్ట్రపతి ఆమోదం పొందిన బిల్లును తీసుకువచ్చినప్పటికీ, 2019 ఎన్నికల ముంగిట ఉండటంతో ఆ బిల్లును చట్ట సవరణ రూపంలో శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయడం సాధ్యం కాలేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి నెట్టెం రఘురాం గుర్తు చేశారు.అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాజకీయ కారణాలతో ఆ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేసిందని వివరించారు.తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన అనంతరం రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రభుత్వం జి.ఓ. నెం.144ను జారీ చేసిందన్నారు. అయితే, ఇన్నాం భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించకపోవడంతో రైతులు, భూముల యజమానులు ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం మరోసారి సమావేశమై సమస్యను సమగ్రంగా పరిశీలించి, ఇనాం భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి పూర్తిగా తొలగించి, భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేలా అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని వినతిపత్రంలో కోరారు.ఈ వినతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులతో సమగ్రంగా పరిశీలించి, రైతులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నెట్టెం రఘురాం తెలిపారు.

## నేడు తిరుమలగిరి లో గిరిప్రదక్షిణ



**జగ్గయ్యపేట జులై 28 (వార్తప్రభ)**మండలం తిరుమలగిరి గ్రామంలో వేంచేసిఉన్న స్వయంభు శ్రీ వల్మీకోద్భవ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ప్రతి నెల పౌర్ణమి రోజు నిర్వహించు గిరిప్రదక్షిణ కార్యక్రమం భాగంగా. నేడు బుధవారం ఉదయం 7.30 నిమిషములకు పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ కార్యక్రమం జరుగును. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు జగ్గయ్యపేట నియోజకవర్గం శ్రీరాం రాజగోపాల్ పాల్గొనదురు. కావున యావన్మంది భక్తులు ఈ గిరి ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గుమ్మా వెంకటేష్, ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. రంగారావు వారు కోరియున్నారు.

# షుగర్(హెచ్.బి.ఏ1సి), థైరాయిడ్ పరీక్షల్లేక పేటెంట్స్ ఇక్కట్లు!!

**● ప్రైవేటుకు వెళ్లలేక కంటనీరు పెడుతున్న రోగులు ● తక్షణమే ల్యాబ్ సేవలను విస్తరించాలని డిమాండ్ ● కలెక్టర్ కలగజేసుకుంటేనే పేదలకు ఊరట**




**పెద్దపల్లి జూలై 28 (వార్తాప్రభ):**రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి నిత్యం ఆశగా వచ్చే పేద రోగుల గుండెల్లో ఇప్పుడు ఓ తీరని వేదన అలముకుంది. కంటికి రెప్పలా కాపాడాల్సిన పెద్ద ఆసుపత్రిలోనే మధుమేహాన్ని నిర్ధారించే మూడు నెలల షుగర్ పరీక్ష, జీవితాంతం మందులు వాడాల్సిన థైరాయిడ్ పరీక్షలు లభించక నిరుపేదలు అల్లాడిపోతున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ పేద ప్రాణాలు, ఆసుపత్రికి వచ్చి ల్యాబ్ ముందర గంటల తరబడి నిరీక్షించి, ఆ పరీక్షలు ఇక్కడ అందుబాటులో లేవని సిబ్బంది చెప్పిన మాటలు విని గుండెలు పగిలేలా కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ప్రైవేటు డయాగ్నోస్టిక్స్ కేంద్రాలకు వెళ్లి వేలకు వేలు గుమ్మరించే స్థోమత లేక, తమ రోగం ఏ స్థాయికి చేరిందో తెలియక, మందులు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదోనన్న భయంతో రాత్రిళ్ళు నిద్రలేకుండా నరకం చూస్తున్నారు. ఊపిరిపోసే ఆసుపత్రే ఇలా చేతులెత్తేస్తే తమలాంటి దిక్కులేని వారికి దిక్కెవరంటూ రోగుల హాహాకారాలు ఆసుపత్రి ప్రాంగణంలో ప్రతిధ్వనిస్తున్నాయి. "మా ప్రాణాలకు విలువ లేదా, ఈ పెద్ద ఆసుపత్రిలో కనీస పరీక్షలు కూడా లేకపోతే మేము ఎక్కడికి పోవాలి?" అని వారు అడిగే సెంటిమెంట్ ప్రశ్నలు ప్రతి ఒక్కరి మనసును పిండేస్తున్నాయి. నిత్యం వేలాదిమందికి దిక్కయిన ఈ ఆసుపత్రిలో ఇలాంటి అత్యవసర సేవలు అందుబాటులో లేకపోవడం దారుణమని, కేవలం జిల్లా కలెక్టర్ గనుక ప్రత్యేక చొరవ తీసుకుని స్పందిస్తేనే ఈ కష్టాల నుంచి విముక్తి లభిస్తుందని ఆవేదనతో ఆశిస్తున్నారు. పేదల ఆశల దీపాలు ఆరిపోకముందే స్పందించి, ఆసుపత్రిలో సకల ల్యాబ్ సేవలను వెంటనే పునరుద్ధరించి తమ ఆయుష్షును కాపాడాలని రోగులు, వారి కుటుంబసభ్యులు చేతులు జోడించి కంటనీటితో వేడుకుంటున్నారు.

# పైథాన్‌తో ఏఐ శిక్షణ!!

**● 100 రోజుల విద్యా స్వావలంబన కార్యక్రమం ● భవిష్యత్ ఉద్యోగాలకు ఏఐ కీలకం ● టెక్నాలజీలో నైపుణ్యాలే భవిష్యత్ ● మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా**




**పెద్దపల్లి జూలై 28 (వార్తాప్రభ):**పెరుగుతున్న డిజిటల్ ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం అమలు చేస్తున్న 100 రోజుల విద్యా స్వావలంబన కార్యక్రమంలో భాగంగా శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'పైథాన్ ద్వారా ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్' అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను విద్యార్థులు అవగాహన చేసుకుని వాటిని తమ కెరీర్ నిర్మాణానికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కూడా ఆధునిక సాంకేతిక విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు సుల్తానాబాద్ మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగాధిపతి గడ్డం లక్ష్మి, మంచిర్యాల నెక్సా ఏఐ రా టెక్ సర్వీసెస్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఎ. సదానందం, లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు డా. తోట సతీష్ రిసోర్స్ పర్సన్లుగా పాల్గొని ఏఐ, మెషిన్ లెర్నింగ్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు సాగే ఈ శిక్షణ కార్యక్రమానికి లెఫ్టినెంట్ బి. తిరుపతి సమన్వయకర్తగా వ్యవహరిస్తుండగా, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు డా. వి. నరేష్, డా. ఎ. స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎ. సాంబశివరావు, డా. జి. సుబ్బారావు, శర్వాణి, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**● శాసనమండలి మాజీ చైర్మన్ ఎం.ఎ.షరీఫ్. ● జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చిన పరిష్కారానికి ముందుంటాం. ● రెవెన్యూ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు. బొప్పరాజు వెంకటేశ్వర్లు. ● ఘనంగా ఆల్ ఇండియా స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్ ఫెడరేషన్ నేషనల్ సెమినార్ మరియు గోల్డెన్ జూబ్లీ ఇయర్ సెలబ్రేషన్స్ .● జాతీయ ప్రతినిధులకు, రాష్ట్ర ప్రతినిధులకు ఘన సత్కారం.**







**విజయవాడ: జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీజే) ఆహ్వానం మేరకు జూలై 25 శుక్రవారం విజయవాడ లెమన్ ట్రీ ప్రీమియం హోటల్ నందు "ఆల్ ఇండియా స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫెడరేషన్" ,న్యూఢిల్లీ. గోల్డెన్ జూబ్లీ వేడుకలు మరియు "ప్రస్తుత మీడియాపై ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏ 1) ప్రభావం" అన్న అంశంపై సెమినార్ జరిగింది. ఈ సమావేశానికి ఆల్ ఇండియా స్మాల్ మీడియం న్యూస్ పేపర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు గురీశీదర్ సింగ్ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ముందు చిన్న, మధ్యతరహా పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దేశంలో పత్రిక సంపాదకులు 'రిజిస్టర్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా' పెడుతున్న వివిధ కఠిన తర నిబంధనలు వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫైలింగ్ చేయడంలో ఆలస్యం అయితే 10,000 నుంచి 2 లక్షల వరకు జరిమానా, అది కూడా అతిక్రమిస్తే టైటిల్ రద్దు వంటి నిబంధనలవల్ల పత్రికలు నడపడం కష్టతరంగా మారింది అన్నారు.ప్రధాన కార్యదర్శి ,అశోక్ కుమార్ నవరతన్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో పత్రిక సంపాదన ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కరించడంలో ఆల్ ఇండియా స్మాల్ ,మీడియం న్యూస్ పేపర్స్ ఫెడరేషన్ ముందంజలో ఉందన్నారు.ప్రెస్ కౌన్సిల్ సభ్యులు సుధీర్ కుమార్ పాండే మాట్లాడుతూ పత్రికల సంపాదకులు ఢిల్లీలోని ఆర్ఎన్ఐ నందు ఏమైనా సమస్యలు ఉన్నయెడల నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.ఏపీ మైనారిటీ అఫైర్స్ అడ్వైజర్, మాజీ శాసనమండలి చైర్మన్ ఎం.ఏ. షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పత్రిక సంపాదకులు మరియు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జర్నలిస్టు సంక్షేమ కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మరియు ఇంటి నిర్మాణాల కోసం కోటమి ప్రభుత్వం లో భాగమైన తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలోపెట్టిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బోప్ప రాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జర్నలిస్టుల మరియు అధికారులకు ఇళ్ల స్థలాల విషయం ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యగా ఉందన్నారు.కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్ ఎన్నో ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిశీలించిన ప్రభుత్వం కృషి చేయాలి అన్నారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ కు తాము ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటామని ఏ సమస్య వచ్చినా తాము సహకరిస్తామని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను వెంకటవేణు మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తమ పోరాటం నిరంతరాయంగా సాగుతుందన్నారు. సమాచార శాఖ అవలంబిస్తున్న విధానాలపై ఇప్పటికే అనేకమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఉపయోగం లేదన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల యాక్ట్ విషయంలో స్పందించాల్సిన కార్మిక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.అలాగే రాష్ట్రంలోని ప్రింటర్స్ పబ్లిషర్స్ కు ప్రభుత్వ ప్రకటనలు జారీ చేయడంలో కానీ, అక్రిడిటేషన్లు మంజూరు చేయడంలో కానీ అనేక నిబంధనలు పెట్టి వారిని ఇబ్బందుల గురిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చిన్న మధ్యతరగతి పత్రికల కు ప్రభుత్వ ప్రకటనల ను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి శేఖర్ బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమ్మోజు రమేష్ బాబు, కృష్ణ భగవాన్, ద్వారం వేణుగోపాలరెడ్డి, మన పాటి చక్రవర్తి, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్లోని జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్టులు వారి సందేశం ఇచ్చారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలలో జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు అవుతున్నాయని తెలిపారు అదేవిధంగా ఆంధ్రప్రదేశ్లో కూడా జర్నలిస్టులకు ప్రతినెల పెన్షన్ ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ముఖ్య అతిథుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా విచ్చేసిన వివిధ రాష్ట్రాల ఆల్ ఇండియా స్మాల్ అండ్ మీడియా న్యూస్ పేపర్స్ ఫెడరేషన్ ప్రతినిధులను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీ జె యు )ఆంధ్ర రాష్ట్ర కమిటీ ఘనంగా సత్కరించి మెమెంటో బహుకరించినది. అలాగే జిల్లాల నుంచి విచ్చేసిన జర్నలిస్టులను కూడా సత్కరించింది. చివరగా వందేమాతరం, జనగణమన గీతాలాపనతో కార్యక్రమం ముగిసినది.

## హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన చెన్నకేశవస్వామి



**సంగం జూలై 28 (వార్తాప్రభ ప్రతినిధి)** మడల కేంద్రంలోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు.అందంగా అలంకరించిన హనుమంత వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయ వీధుల్లో విహరించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణలతో స్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణలు మంగళ వాయిద్యాల నడుమ వాహన సేవ భక్తిశ్రద్ధలతో జరిగింది. వాహనోత్సవం సందర్భంగా మహిళలు హారతులు పట్టి మొక్కులు చెల్లించుకోగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## చిన్నారులకు ఆనందాన్ని పంచిన సపోర్ట్ వింగ్స్

**'లిటిల్ స్మైల్స్' కార్యక్రమం విజయవంతం**





**హైదరాబాద్ : జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యువత ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్న సపోర్ట్ వింగ్స్ సంస్థ, జూలై 26, 2026న హైదరాబాద్‌లో 'లిటిల్ స్మైల్స్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో యువ వాలంటీర్లు చిన్నారులతో కలిసి ఆటలు, వినోదాత్మక కార్యక్రమాలు, పరస్పర ముచ్చట్లు నిర్వహించి వారికి ఆనందాన్ని పంచారు. చిన్నారులకు మరపురాని అనుభూతిని అందించడంతో పాటు, యువతలో సేవాభావాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.వివిధ ఆటలు, సరదా కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, ఆనందభరిత వాతావరణాన్ని సృష్టించడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించారు.భారతదేశంలోని 80కి పైగా నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యువజన సంస్థ సపోర్ట్ వింగ్స్, నాయకత్వ వికాస కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా యువతను బాధ్యతాయుతమైన మార్పు సృష్టికర్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది. ఈ సందర్భంగా సపోర్ట్ వింగ్స్ డైరెక్టర్ ప్రతీక్ బోర్వాడే మాట్లాడుతూ,"ఒక చిరునవ్వు జీవితాలను వెలిగించే శక్తిని కలిగి ఉంటుంది. 'లిటిల్ స్మైల్స్' ద్వారా మా యువ వాలంటీర్లు ప్రతి చిన్నారికి వారు విలువైనవారని, తమతో ఎంతోమంది ఉన్నారన్నారు. మనం కలిసి పంచే ప్రతి ఆనంద క్షణం మరింత దయతో కూడిన, మానవతా విలువలు ఉన్న సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. 'లిటిల్ స్మైల్స్' కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు, యువతలో సేవా దృక్పథాన్ని పెంపొందిస్తూ, చిన్న చిన్న మంచి పనుల ద్వారా సమాజంలో గొప్ప మార్పు తీసుకురావాలనే సపోర్ట్ వింగ్స్ సంకల్పాన్ని మరోసారి చాటిచెప్పింది.

## "విద్యార్థులకు షూల పంపిణీ

**క్రమశిక్షణ, పరిశుభ్రతతో చదువుకోవాలని కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్ సూచన**



**షాద్‌నగర్, జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** షాద్‌నగర్ మున్సిపాలిటీ 22,వ వార్డు పరిధిలోని రతన్ కాలనీ--సులేమాన్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు షూల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 22వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నాడికూడా అనిత రఘునాథ్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు జయలక్ష్మి, శమంత, అంజుబాయి, సరస్వతితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉండాలని, స్నానం చేసి శుభ్రమైన దుస్తులు ధరించి పాఠశాలకు హాజరుకావాలని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అనేక మంది నేడు డాక్టర్లు, ఇంజినీర్లు, న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు, ఇతర రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో చదివి జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.అలాగే, పాఠశాలకు రావడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమకు తెలియజేయాలని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులకు షూలను పంపిణీ చేసి అభినందించారు.

## బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్న గణేష్ యాదవ్



**కూకట్ పల్లి,జూలై28(వార్తాప్రభ):**ఆషాడ మాసం సందర్భంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానమేట్ గ్రామానికి చెందిన, శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణేష్ యాదవ్ ఈరోజు హైదర్‌నగర్‌లోని మైసమ్మ అమ్మవారి దేవాలయంలో బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్, గంగల నరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్, గంగల జంగయ్య యాదవ్, గంగల మల్లేష్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు గంగల రాధాకృష్ణ యాదవ్, ఉప్పల ఏకాంత్ గౌడ్, నారగోని కృష్ణ గౌడ్తో పాటు పలువురు సోదరులు, బంధుమిత్రులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.ఆషాడ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.

# అత్కూరుకు రూ.25.90 కోట్ల అభివృద్ధి నిధులు: ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం,జూలై 28 (వార్తాప్రభ) :** ఉంగుటూరు మండలం అత్కూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన "2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత రెండేళ్లలో అత్కూరు గ్రామ అభివృద్ధికి రూ.25.90 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. అలాగే ఏలూరు--పోలవరం కాలువల అనుసంధానానికి రూ.38 కోట్లు, ఎనికేపాడు అండర్‌టన్నెల్‌కు రూ.36 కోట్లు, హై లెవల్ బ్రిడ్జి పనులకు రూ.20.75 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. నియోజకవర్గంలో 60 వేలకుపైగా ఉచిత రక్త పరీక్షలు నిర్వహించామని, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సహకారంతో ఏఐ, సెమీకండక్టర్ రంగాల్లో యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రైతులు, యువత, విద్యార్థుల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని, గన్నవరం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం..

- వైఎస్సార్ సీపీ గుడివాడ నియోజకవర్గ స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు యార్లగడ్డ మహేష్



**గుడ్లవల్లేరు,జూలై 28 (వార్తాప్రభ) :** మెగా డీఎస్సీ పేరిట కూటమి ప్రభుత్వం దగా చేసి యువతను నట్టేట ముంచిందని వైఎస్సార్ సీపీ గుడివాడ నియోజకవర్గ స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు యార్లగడ్డ మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పిలుపు మేరకు మంగళవారం మచిలీపట్నంలో నిర్వహించిన ఇది మెగా డీఎస్సీ కాదు...దగా డీఎస్సీ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం చేపట్టిన ఆందోళన ర్యాలీకి గుడ్లవల్లేరు మండలం నుంచి యువకులు భారీ తరలివెళ్లారు. విద్యార్థులకు వెంటనే ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పోరుబాట పట్టినట్లు తెలిపారు. వెంటనే చర్యలు చేపట్టకపోతే యువకుల భవిష్యత్తు కోసం తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మిరియాల బాబు రాజేంద్ర ప్రసాద్, మండల యువజన విభాగం అధ్యక్షుడు గుదే రవి, గుడ్లవల్లేరు మండల యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వినియోగించుకోండి

-వ్యవసాయ శాఖ ఏవో జి రాజలక్ష్మి



**విస్సన్నపేట,జూలై 28 (వార్తాప్రభ) :** మండలంలో రైతులు బోరు సదుపాయం ఉన్న వారు వరి సాగు చేయవలసిందని ఇతర రైతన్న లు ఆరుతడి పంటలైన మినుములు పెసలు, జొన్నలు మరియు రాగులు సాగుకు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ ఏడి జి రాజలక్ష్మి పొలం పిలుస్తుంది కార్యక్రమంలో తెలియజేశారు. వేమిరెడ్డిపల్లి కొర్లమండ గ్రామాలలో ఈ కార్యక్రమం జరిగింది. అపరాలు పండించే రైతులు బీమా చేసుకునేందుకు మూడు రోజులే గడువు ఉన్నదని వరి పండించే రైతులకు ఆగస్టు 15వ తేదీ వరకు భీమా సదుపాయం ఉన్నట్లు ఆమె చెప్పారు. యూరియా కొనుగోలు చేసే సమయంలో ప్రతి ఒక్క రైతు ఏపిఎం ఎయిమ్స్ లో నమోదు చేసుకోవాలని ఏదైనా సాంకేతిక సమస్యలు వస్తే సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు.

# అనారోగ్యకర జీవన శైలి వల్లే కాలయ సంబంధిత వ్యాధులు - డా. ఏం. విజయ కుమార్




**శేరిలింగంపల్లి,జూలై 28 (వార్తాప్రభ) :** ప్రపంచ హెపటైటిస్ దే సందర్భంగా హుడా ట్రేడ్ సెంటర్ సీనియర్ సిటిజన్స్ భవనంలో కిమ్స్ హాస్పిటల్,కొండాపూర్ సహకారంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్,సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్ మాట్లాడుతూ హెపటైటిస్ వైరస్‌లు,అనారోగ్యకర జీవనశైలి వల్ల కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయని తెలిపారు.వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, పరిశుభ్రమైన ఆహారం,తాగునీరు,హెపటైటిస్-బి టీకా,ఆరోగ్యకర జీవనశైలి ద్వారా వ్యాధిని నివారించవచ్చని సూచించారు.కార్యక్రమంలో లివర్ ఫంక్షన్ టెస్ట్ (ఎల్ఎఫ్‌టీ) పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షత వహించగా, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు జయంత్ కుమార్,నరసింహారావు, వేణుమోహన్,జి.వి.రావు, చంద్రశేఖర్,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి,జాకీర్ హుస్సేన్,వెంకట్ బంగారు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ ఆర్టీసి బస్టాండ్ పనులను సమీక్షించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

- ఆగస్టు చివరికి స్లాబ్ పనులు పూర్తి.. 4 నెలల్లో నూతన బస్టాండ్ అందుబాటులోకి..



**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉద్ఘాటించారు. గుడివాడ ప్రజల చిరకాల కల అయిన ఆర్టీసి బస్టాండ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులతో కలిసి సమీక్షించారు. గుడివాడ ప్రజా వేదిక కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో ఆర్టీసి డి.ఈ జగదీష్ బస్టాండ్ నిర్మాణ పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు. నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని, నిర్ణీత సమయానికల్లా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థ SR Edifice Pvt Ltd ప్రతినిధులకు ఎమ్మెల్యే రాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. "గుడివాడ ప్రజల భావోద్వేగంతో కూడుకున్న ఆర్టీసి బస్టాండ్ సమస్యను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుందన్నారు. బస్టాండ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయనీ, ఆగస్టు నెలాఖరుకల్లా స్లాబ్ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే రాము తెలిపారు. మరో నాలుగు నెలల్లోపు నూతన బస్టాండ్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అంకితం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో RTC అధికారులు, SR Edifice ప్రతినిధులు, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రంగరంగ వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు





**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** గురు పౌర్ణమి వేడుకలలో భాగముగా నాలుగవ రోజు బాబా వారి పూజా కార్యక్రమాలు అభిషేకాలతో పాటు హనుమత్ ప్రభువు యొక్క చాలీసా అంటే చాలీసా ఒక కలియుగవరం.. చాలీసా పారాయణము శ్రీ సరస్వతీ కోలాట భజన మండలి శ్రీ కంతేటి వసుంధర మరియు శిష్య బృందం అంతేగాక తుమ్మలపల్లి అనురాధ మరియు మధులక్ష్మి భక్త బృందాల వారు అద్భుతంగా పారాయణం చేయడం జరిగినది. భక్తబృందాలు విశేషంగా పాల్గొని రంగరంగ వైభవంగా చాలీసా పారాయణం చేయడం జరిగినది. ద్వారకా సాయి సేవా సమితి ఈరోజు ఆషాడ మాసపు సారే అమ్మవారికి సమర్పించడం జరుగుతున్నది. అంతేగాక లక్ష్మీ కుంకుమ పూజ ఇతర కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం లో ప్రెసిడెంట్ దండమూడి సీతారామస్వామి, వైస్ ప్రెసిడెంట్ మరీదు శ్రీనివాసరావు, సెక్రెటరీ డి. నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మానవతా సంస్థ సేవా కార్యక్రమాలు అభినందనీయం..



**కలిదిండి,జూలై 28 (వార్తాప్రభ) :** స్థానిక కలిదిండి మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో కలిదిండి మానవతా సంస్థ నెలవారీ సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి మానవతా సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా కలిదిండి మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కూరెళ్ళ ఏడుకొండలు ని మానవతా సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమం అనంతరం నూతన చైర్మన్ కూరెళ్ళ ఏడుకొండలు మాట్లాడుతూ మానవతా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. సంస్థ అభివృద్ధికి మరియు భవిష్యత్తులో వారు చేపట్టబోయే కార్యక్రమాలకు తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షులు పోకల దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు కలిదిండి ఆంజనేయులు, చైర్మన్ పెటేటి వివేకానంద, కో-చైర్మన్ శ్రీ చిట్టూరి బాలకృష్ణ, కన్వీనర్ గోదావరి సత్యనారాయణ, డైరెక్టర్ మారుబోయిన రత్నారావు, ప్రధాన కార్యదర్శి వడుపు రమేష్, కోశాధికారి పత్తి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పేరం ప్రసాదు, వాకాని సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు తిరుమలశెట్టి రాంబాబు, నూకల శ్యామల రావు గుప్తా మరియు మార్కెట్ యార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్
- 31 న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కు వెళ్లేందుకు సీడీపీవో కి పర్మిషన్ లెటర్ అందజేత



**మైలవరం,జూలై 28 (వార్తాప్రభ) :** అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు.అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ ఈనెల 31వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి వెళుతున్నట్లు మంగళవారం ఉదయం ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు సీడీపీవో పుష్పలత కి ప్రాజెక్టు అధ్యక్షురాలు ఆర్ ఆర్ వి పుష్పకుమారి, రెడ్డిగూడెం సెక్టార్ లీడర్ అరుణ, మహాలక్ష్మి తదితరులతో కలిసి సుధాకర్ పర్మిషన్ లెటర్ అందజేశారు.అనంతరం సిహెచ్ సుధాకర్ మాట్లాడుతూ కనీసచేతనం రూ.26 వేలు ఇవ్వాలినీ, పెన్షన్,పీఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలిని, పెండింగ్ లో ఉన్న మినీ సెంటర్లన్నీ మెయిన్ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేయాలనీ,హెల్పర్ల ప్రమోషన్లకు 5 సంవత్సరాల సీనియారిటీ నిబంధన రద్దు చేయాలనీ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలనీ,పనిభారం పెంచే నవచేతన యాప్ రద్దు చేయాలనీ ఐసిడిఎస్ తో సంబంధం లేని పనులు చేయించరాదని డిమాండ్ చేశారు. పనికి తగిన ప్రతిఫలం కోసం జరుగుతున్న ధర్నాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# కైకలూరు శ్రీ శ్యామలాంబ ఆలయంలో శ్రావణ మాస మహోత్సవాలు

- వైభవంగా ధర్మకర్తల సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం.. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహణ..



**కైకలూరు,జూలై 28 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా కైకలూరు మండలం కైకలూరు గ్రామంలో వేంచేసి ఉన్న ప్రసిద్ధ శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఆలయ సముదాయంలో ఈ ఏడాది శ్రావణ మాస మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ధర్మకర్తల మండలి ఏకగ్రీవంగా తీర్మానించింది. శ్రావణ మాస ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించేందుకు శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఆలయం మరియు శ్రీ కనక లింగేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ ముత్యాల వెంకట సుందర శ్రీనివాసరావు అధ్యక్షతన దేవస్థానం కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ వాసు సమక్షంలో ధర్మకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీ శ్యామలాంబ ఆలయ సముదాయం చైర్మన్ జంపన రామలింగరాజు, ధర్మకర్తలు మరియు దేవస్థానం సిబ్బంది హాజరయ్యారు. గత ఏడాది కంటే ఘనంగా సమావేశంలో శ్రావణ మాసంలో నిర్వహించాల్సిన పూజలు, హోమాలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించారు. గత సంవత్సరం నిర్వహించిన ఉత్సవాల కంటే ఈ సంవత్సరం మరింత వైభవంగా చేయాలని ధర్మకర్తల మండలి ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించింది. ఈ మేరకు ఆలయ అలంకరణలు, భక్తులకు కల్పించే సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. శ్రావణ మాసం అంతా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, భజనలు, ప్రవచనాలు నిర్వహించనున్నట్లు ఈఓ యార్లగడ్డ వాసు తెలిపారు. "శ్రావణ మాసం అమ్మవారికి అత్యంత ప్రీతికరమైనది. భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని" కోరారు. ఉత్సవాల విజయవంతానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామని ధర్మకర్తలు హామీ ఇచ్చారు.

# గ్రామ గ్రామాన పండుగ వాతావరణం ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం సంబరాలు



**విస్సన్నపేట,జూలై 28 (వార్తాప్రభ) :** గ్రామ గ్రామాన పండుగ వాతావరణం ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం వాడ వాడలా సంబరాలు చేసుకుంటున్న వైనం సర్వత్రా వినిపిస్తోంది.ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి సంక్షేమ ఫలాలను ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా అందర్నీ ఆప్యాయత ప్రేమాభిమానాలతో ప్రభుత్వ పథకాలు అందుతున్న వైనాన్ని అడిగి తెలుసుకుంటూ ఆత్మీయ ఆశీస్సులను అందుకుంటున్నామని మండల టిడిపి అధ్యక్షుడు రాయల సుబ్బారావు తెలియజేశారు. 27వ తేదీ నుండి 45 రోజులు పాటు సూపర్ సిక్స్ హామీల అమలు రాజధాని అభివృద్ధి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రజా సమస్యల గురించి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేసేందుకు అంతఃకరణ శుద్ధిగా మనసా వాచా కర్మణా ఆత్మ ప్రభోధాను సారం సేవే లక్ష్యంగా ప్రేమే మార్గంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు

# 56 ఏళ్ల తర్వాత రేపే (జూలై 29 న)గురు పూర్ణిమ



భారతీయ సంప్రదాయంలో గురు పౌర్ణమికి ఎంతో విశిష్ట స్థానం ఉంది. అజ్ఞానమనే చీకటి నుంచి జ్ఞానమనే వెలుగు వైపు నడిపించే గురువులను పూజించే పవిత్రమైన రోజే..

ఈ గురు పౌర్ణమి. ఆషాఢ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున దేశవ్యాప్తంగా ఈ పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీన్ని వ్యాస పౌర్ణమిగా కూడా పిలుస్తారు. ఈ సంవత్సరం గురు పౌర్ణమి ఈ నెల 29వ తేదీన బుధవారం నాడు రానుంది.

పంచాంగం ప్రకారం ఆషాఢ మాస పూర్ణిమ తిథి బుధవారం నాడు వస్తోంది. ఈ సాయంత్రం 6: 18 నిమిషాలకు పూర్ణిమ తిథి ప్రారంభమౌతుంది. మరుసటి రోజు రాత్రి 8: 05 నిమిషాల వం-కు ఉంటుంది. ఉదయ తిథి ప్రకారం 29వ తేదీ నాడే దేశవ్యాప్తంగా గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నారు. 56 సంవత్సరాల తరువాత గురు పూర్ణిమ నాడు శష, హంస, బుధాదిత్య రాజయోగం సంభవించబోతోంది.

గురు పౌర్ణమి రోజున పవిత్ర నదీ స్నానాలు ఆచరించడం, దానధర్మాలు చేయడం వల్ల విశేష పుణ్యఫలం లభిస్తుందని నమ్ముతారు. ఈ రోజున బ్రహ్మ ముహూర్తంలో స్నానం చేయడం ఎంతో శుభకరం. తెల్లవారు జామున 4: 17 నిమిషాల నుంచి 4: 59 నిమిషాల వరకు స్నానాలు, దానాలు చేయడానికి అత్యంత అనుకూలమైన సమయం.

మహాభారతం, అష్టాదశ పురాణాలు, బ్రహ్మసూత్రాలను రచించిన వేద వ్యాస మహర్షి ఆషాఢ పూర్ణిమ నాడే జన్మించారు. సనాతన ధర్మంలో వేదాలను నాలుగు భాగాలుగా వర్గీకరించిన మొదటి గురువుగా వ్యాసుడిని భావిస్తారు. అందుకే ఈ పర్వదినాన్ని వ్యాస పూర్ణిమ అని కూడా పిలుస్తారు. ఈ రోజున గురువులను పూజించి, వారి ఆశీస్సులు తీసుకోవడం వల్ల జీవితంలో ఉన్న కష్టాలన్నీ నశించి, సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

సనాతన ధర్మంలో గురువు స్థానం దైవంతో సమానంగా భావిస్తారు. గురు అనే పదంలో గు అంటే అంధకారం, రు అంటే వెలుగు అని అర్థం. అంటే.. మనలో ఉన్న అజ్ఞాన దీపాన్ని హరించి, జ్ఞాన దీప్తిని వెలిగించేవాడే గురువు. గురువు అనుగ్రహం లేనిదే దైవ సాధన కూడా అసంపూర్ణంగానే మిగిలిపోతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. గురు పౌర్ణమి రోజున తెల్లవారుజామునే లేచి స్నానాదికాలు ముగించుకోవాలి.

ఇంట్లో పూజా మందిరంలో విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, వ్యాస మహర్షి విగ్రహాలు లేదా చిత్రపటాల ముందు దీపారాధన చేయాలి. ప్రత్యక్షంగా గురువులు అందుబాటులో ఉంటే, వారి పాదాలకు నమస్కరించి రక్షా బంధనం కట్టడం, చందనం, పూలతో అలంకరించి పూజించడం ఆనవాయితీ.

శిష్యులు తమ శక్తి సామర్థ్యాల మేరకు గురువులకు వస్త్రాలు, పండ్లు, దక్షిణాదులను సమర్పించి వారి దీవెనలు పొందడం మంచిది. ఒకవేళ తమ గురువులు అందుబాటులో లేకపోతే, వారి ఫొటోను ఎదురుగా ఉంచుకుని మానసికంగా ధ్యానం చేసుకుంటూ పూజించవచ్చు. ఈ గురు పౌర్ణమి రోజున ప్రతి ఒక్కరూ తమ జీవిత మార్గదర్శకులను స్మరించుకుని, వారి దారిలో నడవడానికి సంకల్పం తీసుకుంటారు.

# సంతోష్ ఆటో మోటార్స్‌లో మారుతి న్యూ బ్రెజా కారును

ప్రారంభించిన పారిశ్రామికవేత్త డాక్టర్ పుట్టగుంట సతీష్ కుమార్





**హనుమాన్ జంక్షన్,జూలై 28 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్‌లోని సంతోష్ ఆటో మోటార్స్‌లో మంగళవారం మారుతి సుజుకి నూతన బ్రెజా కారును ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ పుట్టగుంట సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి నూతన వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పుట్టగుంట సతీష్ కుమార్ మాట్లాడుతూ, మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతికత, అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు, ఆకర్షణీయమైన డిజైన్‌తో మారుతి బ్రెజా వినియోగదారులను ఆకట్టుకుంటోందన్నారు. నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని పొందుతున్న సంతోష్ ఆటో మోటార్స్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ ఆటో మోటార్స్ యాజమాన్యం, సిబ్బంది, కస్టమర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో జగన్ బాబాయి ప్రత్యేక పూజలు



**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** బంటుమిల్లి రోడ్లోని భీమేశ్వరాలయంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చేకూరి జగన్మోహన రావు (జగన్‌బాబాయి) తన పుట్టినరోజు సందర్భంగా ఆలయానికి వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, ఆలయ ఛైర్మన్ పట్టపు వెంకట సత్యనారాయణ (చిన్న) తదితరులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో నవభారత్ ఖాదీస్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, సీనియర్ టిడిపి నాయకులు లింగం ప్రసాద్, దేవరపల్లి లక్ష్మీ కోటయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తుంపూడి నాగ వెంకట సాంబశివరావు, ఎఫ్‌పిఎఫ్ కన్వీనర్ డిఆర్బీ ప్రసాద్ తదితరులు జగన్మోహనరావుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# ఈ దారిలో నడిచేదెలా...?

- ఇదేనా మైలవరం పట్టణ ప్రగతి...?
- ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే జిల్లా పరిషత్ రహదారి అధ్వానం
- ఈ రహదారిలో అడుగడుగునా గుంటలే.....!
- ఇదేనా... అభివృద్ధి, ఇదేనా స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర అంటున్న మైలవరం పట్టణ వాసులు
- పట్టించుకునే వారేరి....?





**మైలవరం,జూలై 28 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజక వర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే జిల్లా పరిషత్ రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిలో అడుగడుగునా గుంటలే. పాదచారులు నడిచేందుకు కూడా వీలులేకుండా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి రెండు వైపులా డ్రైనేజీ వ్యవస్థ దరిద్రంగా ఉంది.

**పేలవమైన డ్రైనేజీ:** రహదారికి రెండువైపుల పేలవమైన డ్రైనేజీ కారణంగా కొద్దిపాటి వర్షానికే రహదారి పొడవు నా వర్షపు నీరు నిల్వవుంటుంది. రెండు వైపులా డ్రైనేజీలు పూడిపోవడంతో రోజుల తరబడి నిల్వవున్న మురుగు నీరు కంపు కొడుతున్నా యి. రెండు వైపులా డ్రైనేజీలు మేరకగాను రహదారి పల్లంగా ఉంది. వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో రోజుల తరబడి రహదారి పైనే నిల్వ ఉంటున్నాయి. వాహనాల రద్దీ కారణం గా రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు బురదగా మారి కంపు కొడుతున్నాయి. ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండటంతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. మండల ప్రజా పరిషత్ కార్యాలయం, కోర్టు, పంచాయతీరాజ్ కార్యాలయం, ఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్, వెలుగు కార్యాలయం, మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఈఓ ఆఫీస్) అన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. దీంతో మైలవరం మండల వ్యాప్తంగా ప్రజలు వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చి వెళుతుంటారు. అలాగే కార్యాలయాలకు వచ్చే అధికారులు, సిబ్బంది ఇదే రహదారిలో వస్తుంటారు. రహదారి అధ్వానంగా మారడంతో ఇదేనా మైలవరం పట్టణ ప్రగతి? ఇదేనా స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర అని, పట్టించుకునే వారే లేరా ? అని పట్టణవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి రహదారి అభివృద్ధి పనులు తక్షణమే ప్రారంభించాలని పట్టణవాసులు కోరుతున్నారు.





# మినీ ల్యాబ్ లు మీ చెంతకే.. విద్యార్థులు సద్వినియోగం చేసుకోండి..

- శాస్త్రీయ దృక్పథానికి సరైన ప్రోత్సాహం అందిస్తున్నాం
- ప్రయోగాల ద్వారా నైపుణ్యాల సాధనకు సైన్స్ కిట్ల పంపిణీ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,జూలై 28 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, ప్రయోగాత్మక అభ్యాసాన్ని ప్రోత్సహించేందుకు సైన్స్ ప్రయోగ కిట్లను అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం విజయవాడ అర్బన్ పరిధిలోని సీవీఆర్ మునిసిపల్ హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్కాస్ట్) సౌజన్యంతో పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష, లీప్, ఎస్సీఈఆర్టీ, జెనీ సైన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 100 పాఠశాలలకు సైన్స్ జెనీ బాక్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లను ఉపయోగించడంపై సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దిశానిర్దేశానికి అనుగుణంగా ప్రభుత్వం బడుల్లో మెగా పీటీఎం, గ్రీన్ పాస్‌పోర్టు, 100 రోజుల కార్యాచరణ వంటి వినూత్న కార్యక్రమాలను అమలుచేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్యను అందించేందుకు ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయని.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను భౌతిక రసాయన జీవశాస్త్రాల అంశాలపై ఆసక్తి,తో ఆవిష్కరణల దిశగా నడిపించేందుకు ఆప్కాస్ట్ సహకారంతో సైన్స్ కిట్లను అందజేయడం జరుగుతోందన్నారు. జెనీ సైన్స్ స్టార్టప్ ను రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) కూడా ప్రోత్సహించినట్లు తెలిపారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఆంధ్రాకు ఈ స్టార్టప్ రూపొంది ంచిన సైన్స్ కిట్లు మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

**స్టూడెంట్ సైంటిస్టులపై ప్రత్యేక దృష్టి: డా. కె.శరత్ కుమార్, మెంబర్ సెక్రటరీ, ఆప్కాస్ట్..** మనచుట్టూ ఉన్న పరిసరాల్లో వివిధ అంశాలకు సంబంధించి ప్రశ్నలు వేయడం, వాటిని శాస్త్రీయ పద్ధతిలో పరీక్షించడం, స్వయంగా ప్రయోగాలు నిర్వహించడం ద్వారా విజ్ఞానాన్ని ఆర్జించి, ఆవిష్కరణల దిశగా వెళ్లేలా స్టూడెంట్ సైంటిస్టులపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు ఆప్కాస్ట్ సభ్య కార్యదర్శి డా. కె.శరత్ కుమార్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్ర పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో శాస్త్రసాంకేతిక మండలి సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. జెని బాక్స్ కిట్ల ద్వారా 40 రకాల ప్రయోగాలు చేసేందుకు వీలవుతుందని.. ఈ ప్రయోగాలు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను రేకెత్తించి పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించి నూతన ఆవిష్కరణ దిశగా నడిపించేందుకు అవకాశం కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో భాగంగా నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ 2026 పోస్టర్లను ఆవిష్కరించారు. పదేళ్ల నుంచి 17 ఏళ్ల వయసుగల విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఈ సందర్భంగా అతిథులు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి, డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష ఏపీసీ ఆర్.రమేష్ బాబు, జెనీసైన్స్ వ్యవస్థాపకులు ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వట్టే జానయ్యపై జరిగిన దౌర్జన్యం, పీడియాక్ట్, ప్రభుత్వ అరెస్టులను ఖండిస్తున్నాం

–భేరి రామచంద్ర యాదవ్, డాక్టర్ శివ ముదిరాజ్




**హైదరాబాద్,జూలై 28 (వార్తాప్రభ) :** వట్టే జానయ్యపై జరిగిన దౌర్జన్యం, పీడియాక్ట్, ప్రభుత్వ అరెస్టులను ఖండిస్తున్నామని, ప్రభుత్వం తక్షణమే కేసులు విరమించుకోవాలని హైదరాబాద్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల, బీసీ కులాల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్, డాక్టర్ శివ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వట్టే జానయ్యాపై పెట్టిన పీ.డీ. యాక్ట్, అరెస్టులు, ప్రభుత్వ దౌర్జన్యాలను ఖండిస్తూ జానయ్యకు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు డాక్టర్ శివ ముదిరాజ్, బీ.సీ. ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ డిమాండ్ చేశారు. బిసి సంఘాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూర్యాపేట నుండి కాంటిస్టేడ్ ఎమ్మెల్యే వట్టి జానయ్యపై చేస్తున్న దౌర్జన్యాలు పీడీ యాక్ట్ బీసీలు ఎస్సీ ఎస్టీ, ప్రజాస్వామ్యాన్ని నమ్మిన ప్రతి ఒక్కరూ ఖండించారు. వారు మాట్లాడుతూ పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టి జానయ్య ఆధ్వర్యంలో భువనగిరి రాజ్యాధికార పార్టీ సభ విజయవంతం అయినందున అన్ని పార్టీలు ఆయనపై ఏదో విధంగా దౌర్జన్యాలు చేయడం ఓర్వలేకపోవడంపగతో జానయ్యపై మీరెన్ని కుయుక్తులు పన్నిన ఆయనపై కేసులు బనాయించి బీసీలను ఎదగకుండా చేసేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2029లో ఆయనే ఎమ్మెల్యేగా గెలుస్తాడని గంటపతంగా బీసీ వర్గాలు చెబుతున్నాయనీ, సూర్యాపేటలో ప్రభుత్వమే కాకుండా మిగతా రెడ్డి వర్గాలు ఆయనపై దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. బీసీలు పార్టీ పెట్టకూడదా రాజ్యాధికారంలో భాగం కాకూడదా రెడ్లు కమ్మలు వెలమ దొరలే రాజ్యాన్ని ఎలాలా బీసీ ఉద్యమం గ్రామీణ స్థాయి నుండి హైదరాబాద్ పట్టణం వరకు ఉవ్వెత్తున ఆకాశం మంత లేచి 2029లో రాజ్యాధికారం బహుజనులదే అని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీస్ ఏకమవుతున్నారు. అగ్రవర్ణాలు అధికారంలో ఉన్న మీరు ఎన్ని దౌర్జన్యాలు చేసిన ఎన్ని పీడియాక్టులు పెట్టిన గోడకు బంతి కొడితే ఏ విధంగా ఎగురుతుందో ఉద్యమాలు ఆ రకంగా పైకి లేస్తూనే ఉంటాయి కాక్రోచ్ జనతా పార్టీ యువతను అనుకరిస్తున్న ఉద్యమాలు గుర్తుంచుకోండి ప్రభుత్వ అధికారులు ప్రభుత్వంలో ఉన్న పెద్దల్లారా భంగపాటు మీకు తప్పదు మా ఎమ్మెల్యే వట్టి జానయ్యే వేరే వాళ్ళు రైస్ మిల్లులు నడపడం లేదా వేరే వాళ్ళు ఎన్ని తప్పులు చేసిన మీరు కప్పి తెచ్చుకోవడం ఒక బీసీ నాయకుడు ఎమ్మెల్యేగా ఎదుగుతుంటే ఓర్వలేని అగ్రవర్ణ దొరలారా దౌర్జన్యాలను బీసీ సంఘాల కాకుండా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాలన్నీ ఖండిస్తున్నాయన్నారు. ఖబర్దార్ కాంగ్రెస్ ప్రభుత్వం మీరు చేస్తున్న దౌర్జన్యాలు 2029లో మీకే చుట్టుకుంటది. ముఖ్యంగా రాజ్యాధికార పార్టీయే కాకుండా బీసీ ఉద్యమానికి మద్దతుగా బేరి రామచంద్ర యాదవ్, ఆర్కే సాయన్న, బీసీ సంఘాలతో సమావేశమై ఖండించడం జరిగింది. ప్రజాస్వామ్యంలో దౌర్జన్యాలు అరెస్టులు తప్పుడు సంకేతాలు మీకు ఇష్టలేవా. కార్యవర్గ సమావేశంలో ఐక్యవేదికతో పాటు బీసీ సంఘాలు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాలు కూడా పాల్గొని వట్టి జానయాపై జరిగిన దౌర్జన్యం పీడియాక్ట్, ప్రభుత్వ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు డాక్టర్ శివ ముదిరాజ్, శేర్లింగంపల్లి ముదిరాజ్ సంఘం ఇన్చార్జ్ కొత్తూరు మనోజ్ ముదిరాజ్, సెంట్రల్ యూనివర్సిటీ ఉద్యోగ సంఘం నాయకులు పరమేష్, బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్థిక సాయంల ముదిరాజ్, మరియు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని ఉత్తే జానయ్య మీద పెట్టిన అక్రమ కేసులు వెంటనే పుట్టాయాలని డిమాండ్ చేశారు.

# బీజేపీ ఏపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా నవాబ్ షేక్ సర్దార్ హుస్సేన్ బాధ్యతల స్వీకరణ..



**కాకినాడ,జూలై 28 (వార్తాప్రభ) :** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేంద్ర కార్యాలయం, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ చేతుల మీదుగా, ఆంధ్రప్రదేశ్ బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా ఆధ్వర్యంలో నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో–కన్వీనర్గా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర స్థాయి బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాకినాడ నుండి వేలాది మంది ప్రజలు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆయన స్వగ్రామమైన పెద్దాడ మీదుగా కొనసాగింది. అక్కడ తన తల్లి మరియు అత్తగారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ర్యాలీ ఆయన స్వగ్రామమైన రాజుపాలెం చేరుకోగా, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వేలాది మంది ప్రజలు పాల్గొన్న ఈ భారీ ర్యాలీ విజయవంతంగా కొనసాగింది. అనంతరం రాజుపాలెంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్ మీడియా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో–కన్వీనర్గా తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, మైనారిటీ వర్గాల్లో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా భారీ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు ఘనంగా వీడ్కోలు పలికిన పాఠశాల సిబ్బంది



**గిద్దలూరు,జూలై 28 (వార్తాప్రభ) :** కొమరోలు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,అల్లినగరంలో స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి. పిచ్చయ్య ఇటీవల ప్రమోషన్ పై తెలుగు లెక్చరర్ గా గిద్దలూరు హై స్కూల్ ప్లస్ కు వెళ్ళడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వీడ్కోలు మరియు ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి పాఠశాల హెడ్మాస్టర్ మామిడి పద్మజ అధ్యక్షత వహించారు. పాఠశాల ఉపాధ్యాయులందరూ పిచ్చయ్య పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడి అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. హిందీ సబ్జెక్టులో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తూ గత సంవత్సరం పదవ తరగతి పరీక్షలల్లో హిందీ సబ్జెక్టులో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం, హిందీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గా పనిచేయడం, టెక్స్ట్ బుక్ రైటర్ గా పని చేయడం, ఉపాధ్యాయ యూనియన్లకు జిల్లా బాధ్యులుగా ఉంటూ పాఠశాల అభివృద్ధికి సహాయం చేయడంలో ముందుండేవారని హెడ్మాస్టర్ తెలిపారు. 8వ తరగతి విద్యార్థులను జాతీయ ఉపకార వేతన పరీక్షకు సంసిద్ధత చేయుటకు అవసరమైన స్టడీ మెటీరియల్, 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, విద్యార్థులకు కాపీ రైటింగ్ బుక్స్, విద్యాసామాగ్రిని తన సొంత డబ్బులతో సమకూర్చారని తెలిపారు. ఈ సందర్భంగా పిచ్చయ్య ను పాఠశాల హెడ్మాస్టర్ మరియు పాఠశాల సిబ్బంది శాలువా, పూలమాల, గిఫ్ట్ తో ఘన సన్మానం చేసి వీడ్కోలు పలికారు. పిచ్చయ్య విద్యార్థులను ఉద్దేశించి మోటివేషనల్ స్పీచ్ ఇచ్చారు. పిచ్చయ్య తనను ఇంతగా అభిమానించి సన్మానించిన హెడ్మాస్టర్ కు మరియు ఉపాధ్యాయ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ మామిడి పద్మజ ,జనార్ధన్ రాజు, హరికుమార్ చౌదరి, చంద్రమోహన్, శివరామ్, ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, కృష్ణమూర్తి ,పకీరయ్య, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణ లో అందరూ భాగస్వామ్యం కావాలి..



**గుంటూరు,జూలై 28 (వార్తాప్రభ) :** ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈరోజు తెల్లాకుల జాలయ్య పోలీశెట్టి సోమ–సుందరం కళాశాల (స్వయం ప్రతిపత్తి ) జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో సందీప్ శ్రీమతి శ్వేతా రెడ్డి ఫౌండేషన్, ఐ టి సి మిషన్ సునేత్రా కల్,బ్యాంక్ అఫ్ బరోడా వారి కలయికతో గ్రీన్ కాన్ఫ్లుయెన్స్ –2026, మన ప్రకృతి మన బాధ్యత అనే అంశంపై ఒకరోజు కార్యాశాల నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సలహాదారు పి మల్లికార్జునరావు మాట్లాడుతూ సమస్త ప్రాణికోటికి ప్రణాధారమైన ప్రకృతిని రక్షించుకోవడం, భావితరాల వారికి వెలకట్టలేని సంపదను అందించడం మనందరి బాధ్యతని, అంతే కాకుండా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కె వి బ్రహ్మం అధ్యక్షత వహించారు. వీరితో పాటు కార్యక్రమం లో గౌరవ అతిథులుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జాతీయ సేవా పథక విభాగ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ వి దివ్యతేజోమూర్తి,ఐ టి సి ఎం యస్ కె ఫినిష్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్ కె వి నారాయణ, బ్యాంక్ అఫ్ బరోడా లక్ష్మీపురం బ్రాంచ్, గుంటూరు చీఫ్ మేనేజర్, కె వెంకట రమణ రావు, రిసోర్స్ పర్సన్స్ గా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్విరాంమెంటల్ విభాగ ప్రొఫెసర్ పి బ్రహ్మజీ రావు, హిందూ కళాశాల విశ్రాంతఅసోసియేట్ ప్రొపెసర్ కె వి యస్ దుర్గా ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎం డి నజీనా బేగం పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన వాలిడిటరీ కార్యక్రమం లో ఎన్విరాన్మెంట్ నోడల్ అధికారి డి తిరుపతి రెడ్డి, స్టెప్ యూత్ మేనేజర్ బి రాధిక పాల్గొన్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీర్, ఫాంసి కళాశాల ల నుండి 250 మంది విద్యార్థులు ఈ కార్య శాలలో విచ్చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రకృతి పరిరక్షణ గురించి అవగాహనా కార్యక్రమం జరిగింది. అందరూ కలసి మన ప్రకృతి –మన బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేశారని కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జె వి సుధీర్ కుమార్ తెలిపారు. కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ భాను మురళి, సి హెచ్ రాంబాబు, జి సురేష్ కుమార్,వై వి ఆర్ యస్ కుమార్, చంద్రిక, ఆర్ జయ శైలజ మరియు ఎన్ యస్ యస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరోపణలతో ప్రతిష్ఠ దెబ్బతీయడం బాధాకరం: గీసాల వీరబాబు

- వాస్తవాలు వెలుగులోకి రావాలంటే నిష్పక్షపాత విచారణ జరగాలి.



**కాకినాడ,జూలై 28 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామంలోని సర్వే నంబర్ 2/3లో సుమారు 440 గజాల స్థలానికి సంబంధించి తన పేరును అనవసరంగా వివాదంలోకి లాగడం బాధాకరమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గీసాల శ్రీను తనయుడు గీసాల వీరబాబు పేర్కొన్నారు. తాను చేయని తప్పుకు బాధ్యుడిగా చిత్రీకరిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేయడం సరైన విధానం కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సదరు భూమికి తనకు ఎలాంటి సంబంధం లేదని, రిజిస్ట్రేషన్ లేదా ఇతర అక్రమ వ్యవహారాల్లో తన ప్రమేయం ఉందన్న ప్రచారం పూర్తిగా నిరాధారమని వీరబాబు స్పష్టం చేశారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా ఆ స్థలం వివిధ ప్రభుత్వ శాఖల వినియోగంలోనే ఉందని, ఈ విషయం స్థానిక ప్రజలకు కూడా తెలిసిన అంశమేనని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులు భూమికి సంబంధించిన రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ ఆధారాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన కోరారు. నిష్పక్షపాత విచారణ జరిగితే నిజానిజాలు వెలుగులోకి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా వ్యక్తులపై ఆరోపణలు చేయడం వల్ల వారి వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు కుటుంబ సభ్యులు కూడా మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని వీరబాబు అన్నారు. ప్రజలు అసత్య ప్రచారాన్ని నమ్మకుండా వాస్తవాలను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తూ, ఈ అంశంపై ప్రభుత్వం మరియు అధికారులు రాజకీయాలకు అతీతంగా న్యాయబద్ధమైన విచారణ చేపట్టాలని కోరారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో యువత చురుకుగా పాల్గొని ఓటర్ వివరాలు ధృవీకరించుకోవాలి

---మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతా రెడ్డి పిలుపు




**శేరిలింగంపల్లి,జూలై 28 (వార్తాప్రభ) :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో యువత చురుకుగా పాల్గొని ఓటరు వివరాలను ధ్రువీకరించుకోవాలని మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చందానగర్‌లోని ప్రజ్ఞా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో బొబ్బ నవత రెడ్డి మాట్లాడారు. ఓటు హక్కు కలిగిన ప్రతి విద్యార్థి ఎస్ఐఆర్‌లో నమోదు చేసుకోవడంతో పాటు తమ తల్లిదండ్రులు,బంధువులకు ఫారాలు నింపడంలో సహకరించాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ వివరాలను ధ్రువీకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు రాజు,చందర్ రావు,సలీం, షబానా బేగం,శ్రీనివాస్ (బాబులు),నగేష్ రెడ్డి,వంశీ రెడ్డి, జె.వి.రావు,అనంత రెడ్డి, అంజి యాదవ్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188